నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 08 ఆగస్టు 2024 | www.navatelangana.com

3.50 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

జోగిపేట కోర్టులో రిమాండ్



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండలం డాకూర్ వద్ద బైకుపై 3.50 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశాలతో మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి, ఎస్సై అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో బుధవారం డాకూర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వట్‌పల్లి మండలం గౌతపూర్ గ్రామానికి చెందిన మియాయుద్దిన్ అనే వ్యక్తి 3.50కిలోల ఎండు గంజాయిని బైక్‌పై తీసుకెళ్తు పట్టుబడినట్టు వారు తెలిపారు. ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని, నిందితుడిని అదుపులోకి తీసుకొని జోగిపేట ఎక్సైజ్ అధికారులకు అప్పగిం చారు. నిందితుడిని జోగిపేట కోర్టుకు రిమాండ్‌కు పంపినట్లు జోగిపేట ఎక్సైజ్ సీఐ సాగర్ రెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి, జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్ : హుస్నాబాద్ మండలంలోని జిల్లల్ల గడ్డలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి పొన్నం ప్రభాకర్ పాఠశాలలో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. రెగ్యులర్‌గా క్లాస్‌లు జరుగుతున్నాయా ఉదయం టిఫిన్, ఆహారం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగదికి వెళ్లి పరిసరాలు పరిశీలించారు. అప్పుడే వండిన ఆహారాన్ని కూరలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ఎంత మంది ఉన్నారు,. స్టాఫ్ ఎంత మంది.,? విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు ఉన్నారా అని ప్రిన్సిపల్‌ని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జిల్లల గడ్డ సాంఘిక సంక్షేమ పాఠశాల నుంచి జాతీయ స్థాయిలో హ్యాండ్ బాల్, త్రో బాల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి సత్కరించారు.స్కూల్‌లో డోర్స్,విండోస్ సరిగా లేవని ,స్కూల్ పక్కనే కొండ ఉండడం వల్ల కొంత ఇబ్బందులు ఉన్నాయని దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పాఠశాల పరిసరాలు బాగు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులంతా చదువులోనూ ఆటల్లోనూ మంచి ప్రతిభ కనబర్చాలని సూచించారు.

ప్రయివేట్ దవాఖానాల దందా

- మొక్కుబడిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010
- నిబంధనలు పాటించని ఆసుపత్రుల నిర్వాహకులు
- విచ్చలవిడిగా ప్రయివేట్ దవాఖానాలు
- బోర్డుల్లో పేరొకరిది...వైద్యం చేసేది మరొకరు
- పేరుకే ధరల పట్టికలు... బిల్లులేసేది మూడింతలు
- ఉమ్మడి జిల్లాలో ప్రయివేట్ దవాఖానాల దందా
- నామమాత్రపు తనిఖీలతో మమా అనిపిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ

ప్రయివేట్ దవాఖానాలు కిరాణం కొట్ల మాదిరే వెలుస్తున్నాయి. వారానికో ఆసుపత్రి ప్రారంభమవుతోంది. పల్లెలు, పట్నాలనే తేడా లేకుండా చిన్నిపాటి క్లినిక్‌లు మొదలు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు పెడుతున్నారు. వైద్యం ఖరీదైన వ్యాపారంగా మారదంతో ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నాయి. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010 మొక్కుబడిగా అమలవుతుంది. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పేరుకు తనిఖీలు చేస్తున్నా ప్రయివేట్ ఆసుపత్రుల దందాను అడ్డుకోలేకపోతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వందల సంఖ్యలో ప్రయివేట్ ఆసుపత్రులు వెలిశాయి. చాలా వరకు కనీస నిబంధనలు కూడా పాటించట్లేదు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ప్రయివేట్ ఆసుపత్రుల దందా సాగుతోంది. డాక్టర్ సర్టిఫికెట్ చూపించి ఆసుపత్రి పెట్టేస్తున్నారు. డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లు, ఎక్స్‌రే క్లినిక్, ల్యాబ్‌లు, మందుల షాపులు, ఫిజియోథెరపీ, బ్లడ్‌బ్యాంక్, ఆసుపత్రులు ఇలా ప్రతిదీ వ్యాపార కేంద్రాలుగా మారాయి. పేరుగాంచిన డాక్టర్ లేదంటే మెడికల్ కోర్సులో ఆదరణ కల్గిన స్పెషలిస్ట్ వైద్యుల పేర్లతో ఆసుపత్రుల్ని పెట్టేస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లను మధ్యవర్తులుగా పెట్టుకుని పేషెంట్లను రప్పిస్తున్నారు. స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రులున్నప్పటికీ లేదంటే ప్రయివేట్‌గా చిన్నపాటి ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటే సరిపోయే పరిస్థితి ఉన్నప్పటికీ జిల్లా, పట్టణ కేంద్రాల్లోని పెద్ద పెద్ద డాక్టర్లు ఉన్నారనే పేరుతో అక్కడికి వచ్చేలా చేసుకుంటున్నారు. ప్రతి ఆసుపత్రి రిసిప్షన్ కౌంటర్‌లో ఉండే కంప్యూటర్‌లో ఆర్‌ఎంపీలు, పీఎంపీల పేర్లుంటాయి. వారి పేరిట ఎంటర్ చేసిన పేషెంట్‌కు కొంత రాయితీ ఇస్తున్నట్లు బిల్లుల్లో చూపుతారు. ఓపీలో సంబంధిత డాక్టర్ పరిక్షించి ఆరోగ్య సమస్య ఏమిటో తెల్సుకునే ప్రయత్నం చేయకుండా పీజు కట్టిలోపలికి వెళ్లగానే చిట్టి మీద ఐదారు రకాల పరీక్షలు చేయించుకోండి అంటూ పంపిస్తారు. వంట్లో ఏం రోగముందో తెల్వాలంటే పరీక్షలు చేయాల్సిందేనని డాక్టర్ తెగేసి చెప్పేసరికి చేసేదేమిలేక రక్తం, మూత్రం, తెమడ ఇతర పరీక్షలు చేస్తారు. అందులోనూ తేలలేదంటూ స్కానింగ్ చేయించమంటారు. వివిద రకాల పరీక్షలు చేసేందుకు ఎంత తీసుకోవాలనే విషయంలోనూ నిబంధనలుంటాయి. అయితే వాటిని బోర్డులో రాసిపెట్టినా అంత కంటే ఎక్కువ తీసుకుంటారు. శస్త్ర చికిత్స చేయాల్సి వస్తే కూడా ఆపరేషన్ థియేటర్ ఫీజు, ఆపరేషన్ చేసిన వైద్యుడి ఫీజు, ఇతర సిబ్బంది ఫీజు, మందులు, ఇతర సామాగ్రి అంటూ వేర్వేరుగా లెక్కలేసి లక్షలు చేస్తారు. ఇక ఐసీయూలో చికిత్స చేయాల్సి వస్తే జేబు గుల్ల అయినట్లే జరుగుతోంది. ఐసీలో పెట్టిన పేషెంట్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినా ఇంకా కొన్ని రోజులు అక్కడే ఉంచాలని అధిక ఫీజులు దండుకుంటారు. కొందరు పేషెంట్ల ఆరోగ్యం మెరుగుపడకపోయినా చాలా కవర్ అవుతున్నట్లు చెప్పి డబ్బులు లాగేస్తున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ సీజన్‌లో డెంగ్యూ లేకపోయినా అనుమానం పేరిట వైద్యం చేసి లక్షలు వసూలు చేస్తున్నారు. ప్లేట్‌లేట్స్ తగ్గినట్లు పరీక్షల్లో చూపి భయానికి గురి చేస్తూ డబ్బులు దండుకుంటున్న ఆసుపత్రులున్నాయి. కొన్ని చోట్ల అబార్షన్లు చేస్తున్నారు. చట్ట విరుద్ధమైనప్పటికీ చేతినిండా డబ్బులొస్తాయనే దురాశతో పిండస్త దశలోనే శిశువును చిదిమేస్తూ వ్యాపారం చేస్తున్నారు. ఆసుపత్రి బోర్డులో పేర్కొన్న డాక్టర్లు, వారు చదవిని మెడికల్ కోర్సు వివరాలుంటాయి. కానీ..! అందులో చాలా మంది వైద్యులుండరు. పేరొకర్ది... వైద్యం చేసేది మరొకరుంటారు. అన్ని రకాల స్పెషలిస్టులున్నారని బోర్డుల్లో రాసి పెట్టి సమయానికి అందుబాటులో లేరంటూ దాట వేస్తారు. సంగారెడ్డిలో వారానికో దవఖానా ప్రారంభమవుతుంది. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, పటాన్‌చెరు, నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేట, మెదక్, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ వంటి పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లో సైతం ప్రయివేట్ ఆసుపత్రులు విచ్చల విడిగా వెలుస్తున్నాయి.



క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం-2010 ప్రకారం ప్రతి ప్రయివేట్ ఆసుపత్రి విధిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ నుంచి ప్రతి ఏటా అనుమతులు పొందాలి. ప్రారంభించినప్పుడు పొందిన లైసెన్స్‌ను ప్రతి ఏటా రెన్యూవల్ చేయించుకోవాలి. అయితే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రారంభ దశలో ఏదో ఒక డాక్టర్ సర్టిఫికెట్, భవన సముదాయం చూపగానే అనుమతి ఇస్తున్నారు. ఆ తర్వాత ఆ ఆసుపత్రిలో ఏ నిబంధనలు పాటించడంలేదు. ఆసుపత్రి భవనానికి తప్పని సరిగా ఫైర్ సేఫ్టీ అనుమతి ఉండాలి. చూట్టూ ఫైరింజన్ తిరిగేలా స్థలముండాలి. వైద్యులు, సిబ్బంది వైద్యం చేసేందుకు వాళ్లకు ఉన్న అర్హతలేంటో తనిఖీ చేయాలి. సర్టిఫికెట్స్ ఒరిజినల్ కాకపోయినా కొందరు ఆసుపత్రుల్ని నడుపుతున్నారు. మెదక్‌లో ఎంబీబీఎస్ చదివిన వ్యక్తి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నడుపుతున్న పరిస్థితి ఉంది. సంగారెడ్డి జిల్లాలో 613 ప్రయివేట్ ఆసుపత్రులు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా 557 ఆసుపత్రులకు అనుమతిచ్చారు. మెదక్, సిద్దిపేటలోనూ చాలా వరకు అనుమతుల్లేవు. అనుమతి ఉన్నా నిబంధనలు పాటించడంలేదు.

పట్టించుకోని వైద్య, ఆరోగ్య శాఖ

ప్రయివేట్ ఆసుపత్రులకు అనుమతులివ్వడం వరకే అధికారాలున్న వైద్య, ఆరోగ్య శాఖ నిబంధనల విషయంలో పట్టించుకోవడంలేదు. ప్రయివేట్ ఆసుపత్రుల్లో భవనం, ఇతర సదుపాయాలు, ఆసుపత్రి నిర్వహణ, పేషెంట్లకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఫీజులు, యంత్ర పరికరాలు, నాణ్యమైన మందులు, ల్యాబ్‌లో టెక్నీషియన్స్ సర్టిఫికెట్స్, ధరల పట్టిక అమలు వంటి విషయాలపై నిరంతర తనిఖీలు చేయాలని డిమాండ్ ఉంది. అయితే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ప్రభుత్వ ఆసుపత్రుల పర్యవేక్షణ పనుల పేరిట ప్రయివేట్ ఆసుపత్రుల తనిఖీలు పట్టట్లేదు. ఇటీవల సంగారెడ్డి జిల్లాలో 8 క్లస్టర్లను ఏర్పాటు చేసి ప్రయివేట్ ఆసుపత్రుల్ని తనిఖీ చేశారు. ఇందులో 40 ఆసుపత్రుల్ని సీజ్ చేయగా 30 ఆసుపత్రులకు నోటీసులిచ్చారు. తనిఖీలకు వస్తున్నట్లు ముందే చెప్పడంతో లోపాల్లేకుండా చూసుకుని తప్పించుకుంటున్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

చిన్న గుండవెల్లి కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో ఏసీపీ మధు



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు యువత పాల్పడొద్దు అని ఏసీపి మధు అన్నారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామంలో సీఐ శ్రీను, ఎస్ఐ అపూర్వ రెడ్డితో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కల్పించడం ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకోవడానికి ఈ ప్రోగ్రాం నిర్వహించామన్నారు. యువత గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. మొబైల్ ఫోన్‌లో అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పొద్దన్నారు. ఎటువంటి వెబ్ సైట్లు ఓపెన్ చేయొద్దని సైబర్ నేరాలకు పాల్పడవద్దని సూచించారు. నేను సైతం కార్యక్రమంలో భాగంగా యువత ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చి పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. గ్రామంలో ఏ సమస్య తలెత్తినా వెంటనే 100 ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అనంతరం ఏసీపీ , సీఐ, ఎస్ఐ కలిసి సీసీ కెమెరాలకు రూ.15 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కంగ్టి



మండలంలోని తుర్కవాడగామకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు భోజిరెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ సెట్కార్, పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు బుధవారం భోజిరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మృతుడి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని అన్నారు. కాగా రాకేష్ సెట్కార్.. మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ మారుతి రెడ్డి, మాజీ ఎంపీపీ దామనాగన్న ప్రశాంత్ సెట్కార్, గోపాల్, పండరి తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఈఓకి సన్మానం



నవతెలంగాణ-కల్హేర్

మండల ఏఈఓ మాధవ నాయుడు బదిలీపై మరోచోటుకు వెళున్న నేపథ్యంలో బీఆర్ఎస్ మండల యువత అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పీఏ సంతోష్ కుమార్ ముదిరాజ్, యువ నాయకులు, బీఆర్ఎస్ మండల సోషల్ మీడియా అధ్యక్షులు(కాంట్రాక్టర్) నర్వ ప్రశాంత్ సాగర్‌లు ఏఈఓని బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు.

పర్యావరణ పరిరక్షణకే 'స్వచ్ఛదనం-పచ్చదనం'

నవతెలంగాణ-కంగ్టి



మానవ మనుగడకు పర్యావరణమే కీలకమని పర్యావరణాన్ని కాపాడుకోవడానికే 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్ కుపేందర్ రెడ్డి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ సుభాష్ అన్నారు. మండలంలోని దేగుల్‌వాడి గ్రామ పంచాయతీలో 'స్వచ్ఛదనం -పచ్చదనం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అందులో భాగంగా గ్రామసభ నిర్వహించి.. స్వచ్ఛదనం-పచ్చదనంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటాలని కోరారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నివారించాలని సూచించారు. వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ రేఖరాణి, బసిరెడ్డి, యువకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా మీర్జాపూర్(బి) జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు 'చేనేత వస్త్రాలు ధరించడం.. వస్త్రాల ప్రాముఖ్యత' అనే అంశాలపై బుధవారం వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడం కోసమే ఈ పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-కొండాపూర్



పర్యావరణ పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని ఉప తహసీల్దార్, తొగర్‌పల్లి గ్రామ స్పెషల్ ఆఫీసర్ మర్రి ప్రదీప్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం షుగర్‌పల్లి గ్రామంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. గ్రామంలో చెత్తాచెదారాన్ని ఇష్టానుసారంగా వేయకుండా.. పంచాయతీ ట్రాక్టర్లకు అప్పజెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-జోగిపేట

అనుమానాస్పద స్థితిలో బీటెక్ విద్యార్థి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి జోగిపేట పట్టణంలో జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జోగిపేట పట్టణానికి చెందిన ఆర్తి(18) పటాన్చెరు ప్రాంతంలో బిటెక్ ఫస్టియర్ చదువుతున్నది. కాగా బుధవారం రోజున ఇంట్లోని పైన గదిలో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న జోగిపేట పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియ రావలసి ఉంది.

రెండు బైకులు ఢీ.. మహిళ మృతి

నవతెలంగాణ-జహీరాబాద్

రెండు బైక్‌లు ఢీకొట్టుకున్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామం వద్ద జాతీయ రహదారి పై జరిగింది. చిరాక్‌పల్లి ఎస్ఐ రామ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సత్వార్ వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న ఓ బైక్‌ను..వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళుతున్న చాకలి అంబికా(30) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

యువత చేనేత వస్త్రాలను ధరించాలి

- వారసత్వ సంపద చేనేత రంగాన్ని ప్రోత్సహించాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

యువత చేనేత వస్త్రాలను ధరించి, వారసత్వ సంపద, చేనేత రంగాన్ని ప్రోత్సహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి ఐటిఐ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని.. జిల్లా అధికారులు, చేనేత కార్మికులతో కలిసి కలెక్టర్ క్రాంతి వల్లూరు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు, చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందిస్తున్నదన్నారు. పవర్ లూమ్ కంటే చేతి పనితో చేసే హ్యాండ్లూమ్ ఎంతో గొప్పదని, గద్వాల చేనేత చీరలంటే ఎంతో ఖ్యాతి ఉందన్నారు. ప్రతి ఒక్కరు చేనేత చీరలను ధరించేటట్లు ప్రోత్సహించడం' కోసమే ఈ ర్యాలీ నిర్వహించినట్టు చెప్పారు. చేనేత వృత్తిని అందులోని నైపుణ్యాన్ని యువత తెలుసుకొని నేర్చు కోవాలన్నారు. చేనేత వస్త్రాలు వారసత్వ కళా రంగాన్ని కాపాడాలన్నారు. చేనేత వస్త్రాలు ప్రజలందరూ ధరించాలని, అందరికి అవగహన కల్పిస్తే చేనేత రంగాన్ని కాపాడిన వారమౌతమన్నారు. చేనేత వస్తువులకు ఆదరణ తగ్గకుండా వారికి ప్రోత్సాహాన్ని అందించి రాబోయే తరానికి చేనేత వస్తువుల వినియోగంపై మక్కువను పెంపొందించడమే చేనేత రంగానికి ఇచ్చే గొప్ప బహుమానం అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు ,చేనేత జౌళి శాఖ అధికారి వెంకటరావు, చేనేత, ఉన్ని చేనేత సహకార సంఘాలు నారాయణఖేడ్, జోగిపేట సంఘం సభ్యులు, జిల్లా అధికారులు,కార్మికులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన ట్రెయినీ కలెక్టర్ మనోజ్

నవతెలంగాణ-సంగారెడ్డి



'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా ట్రెయినీ కలక్టర్ మనోజ్ సంగారెడ్డి పట్టణంలోని పలు వార్డులను బుధవారం పర్యటించారు. వార్డుల్లోని సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. 18వ వార్డు మధుర నగర్ కాలనీవాసులు త్రీ ఫేస్ కరెంటు కోసం ఆయనకు విజ్ఞప్తి చేయగా పరిష్క రిస్తానని హామీ ఇచ్చారు. చెత్త రోడ్డుపై వేస్తున్న వ్యక్తికి రూ.10,000 జరిమానా విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను మున్సిపల్ ఏర్పాటు చేసిన వాహనాల్లోనే వేయాలని సూచించారు.లేనియెడల జరిమానా తప్పదని హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రం గా ఉంటే అనారోగ్యం దరిచేరదన్నారు. కాగా పర్యట నలో తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరిస్తానని కృషి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సురేష్ పవర్, మున్సిపల్ డీఈ ఇంతియాజ్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్ బాబు, సైదులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా టార్గెట్ ..హుస్నాబాద్‌లోనే సాగు చేసే ప్రణాళిక

- ప్రధాన సమస్యలు లేకుండా రైతులకు ఉత్పత్తి
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

ఆయిల్ పాం ప్లాంటేషన్ చేయడంలో సిద్దిపేట జిల్లా టార్గెట్ రూ.4 వేల ఎకరాలుగా ఉందని, జిల్లా టార్గెట్‌ను హుస్నాబాద్‌లోనే రూ.4 వేల ఎకరాలలో సాగు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని జిల్లలగడ్డలో రైతు వీరన్న పొలంలో ఆయిల్ పాం ప్లాంటేషన్ కార్యక్రమంలో సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయిల్ పాం మొక్కలు నాటారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఒక జిల్లల గడ్డలో రైతు వీరన్న 30 ఎకరాల్లో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేస్తున్నారన్నారు. రైతులు ఆయిల్ పామ్ ప్లాంటేషన్ సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఆయిల్ పాం కల్టివేషన్ ద్వారా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు అడవి పందులు, కోతుల బెడద, దొంగల బెడద లేకుండా రైతులకు ఉత్పత్తి వస్తుందన్నారు. మొక్క పెట్టిన మూడు సంవత్సరాలకు పంట చేతికి వస్తుందన్నారు. ఎకరానికి ఖర్చులు పొగ లక్ష రూపాయలు మిగులుతాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా చెప్పారని చెప్పారు. హుస్నాబాద్ కేంద్రంగా రైతులను చైతన్యం చేసి ఆయిల్ పాం సాగుచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మనం వాడుతున్న ఆయిల్‌లో 10 శాతం కూడా ఉత్పత్తి చేసుకోవడం లేదన్నారు. ఈ పంట గుంటలు కొండలు ఎక్కడైనా సాగు చేసుకోవచ్చని సూచించారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసుకుంటూ డ్రిప్ ,మొక్కలు కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగులో అంతర్ పంటలు కూడా వేసుకోవచ్చన్నారు. ఉత్పత్తి అయిన దానిని కొనుగోలు చేసి వాటిని తీసే కర్మాగారం కూడా ఏర్పాటు అవుతుందన్నారు. ఏ ప్రభుత్వ అధికారిని సంప్రదించినా ఆ స్కీమ్‌ను చెప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రైతులు ఆయిల్ ఫామ్ సాగులు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రైతులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్‌ల పట్టివేత

నవతెలంగాణ -నంగునూరు



ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్ లను బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.ఆసీఫ్ చెప్పారు.నంగునూరు మండలం ఖాతా శివారులో ఖాతా గ్రామానికి చెందిన చల్లా సత్తిరెడ్డి, సందింటి ప్రవీణ్, పోలిరెడ్డి తిరుపతి లను వారివి గుర్తించామన్నారు.ముగ్గురు ట్రాక్టర్లలో ఎలాంటి అనుమతి లేకుండా దొంగతనంగా ఖాతా వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా ఖాతా శివారులో పట్టుకొని పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి సుమోటో కేసు నమోదు చేశామని చెప్పారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ మోసాలపై 1930కు ఫిర్యాదు చేయాలి
- జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి
- ఐఐటి రామయ్య ఇష్టా విద్యాలయంలో అవగాహనా సదస్సు



నవతెలంగాణ-పటాన్‌చెరు

నిత్యం ఏదో ఒకచోట జరుగుతున్న సైబర్ మోసాలతో ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా సైబర్ క్రైమ్ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డిఅన్నారు. సైబర్ క్రైమ్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా బుధవారం పటేల్‌గూడాలోని ఐఐటి రామయ్య ఇష్టా విద్యాలయంలో సైబర్ క్రైమ్‌పై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు సైబర్ క్రైమ్ మోసాలకు గురవుతున్నాయని.. దేశంలో రోజుకు రూ.40 కోట్ల మేర సైబర్ మోసాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రోజుకు మూడు, నాలుగు చోట్ల సైబర్ క్రైమ్ మోసాలు జరుగుతున్నాయన్నారు. లింక్స్, ఓటీపీ, ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ వంటి పలు సైబర్ మోసాలకు గురవుతున్నట్టు చెప్పారు. వచ్చిన లింక్స్ గానీ ఓటీపీకి గానీ స్పందించొద్దన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులతో పాటు తెలిసిన వాళ్లందరికీ ఇలాంటి మోసాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ సీఐ రవి, కళాశాల చైర్మెన్ కార్తీక్, ప్రిన్సిపాల్ వీ ప్రేమ్ కుమార్, కళాశాల అడ్మిన్ దేవదానం, క్యాంపస్ ఇంచార్జ్ వినోద్, కళాశాలసిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లను అర్హులకు వెంటనే అందజేయాలి

- బస్తీబాటలో సీపీఐ(ఎం) నాయకులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని హెూతి(కె) వద్ద నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే లబ్దిదారులకు అందజేయాలని.. పట్టణంలో అర్హులైన పేదలకు పెన్షన్స్, రేషన్ కార్డులను ఇవ్వాలని సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) బస్తీబాటలో భాగంగా బుధవారం బాగారెడ్డిపల్లి, వడ్డెరకాలనీ, శాంతినగర్‌కాలనీల్లో సీపీఐ(ఎం) బృందం పర్యటించింది. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కల నిజం చేయడానికి ప్రభుత్వం తక్షణమే ఇండ్లను హ్యాండోవర్ చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా కొన్ని రకాల పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చేసి.. లబ్దిదారులకు అప్పజెప్పాలని కోరారు. ఇల్లు లేని పేదలకు కూడా ఇళ్ల స్థలాలు ఇచ్చి, నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తామన్న ప్రభుత్వ హామీని వెంటనే నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెన్షన్లు, రేషన్ కార్డుల సమస్య కూడా పెండింగ్‌లో ఉన్నదని.. రేషన్‌కార్డులు రాక పేదలు అనేక ఏండ్లుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బక్కన్న, సలీముద్దీన్, శాంతమ్మ, యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ కళాకారులకు జీవన భృతి కరువైంది

నవతెలంగాణ-గుమ్మడిదల



నిరుద్యోగ కళాకారులకు జీవన భృతి కరువైందని జన చైతన్య కళాసంస్థ అధ్యక్షుడు ముద్దంగుల ఎల్లయ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలోని డీఆర్ఓ పరశురాం కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ.. జిన్నారం, గుమ్మడిదల మండలాల పరిదిలోని జనచైతన్య కళాసంస్థ కళాకారులు తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని.. వారికి తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగాల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము 1996 నుంచి కుటుంబ నియంత్రణ, బాల కార్మిక వ్యవస్థ, అక్షరాస్యత, మూఢనమ్మకాల నిర్మూలన, ఎయిడ్స్, వనసంరక్షణ సమితి, పర్యావరణంపై మహిళా చైతన్యంపై, మద్యపాన నిషేధంపై అనేక కళా ప్రదర్శనలు నిర్వహించామన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో వేలాది వేదికలపై దూం దాం కార్యక్రమాల్లో నిర్వహించామన్నారు. అయినప్పటికీ తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల విషయంలో తమకు అన్యాయం జరిగిందన్నారు. ఈ విషయాలపై పలువురు అధికారులను కలసి వినతి పత్రాలు సైతం అందజేశామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా కళాకారులకు తెలంగాణ సాంస్కృతిక సారధిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. వృద్ధాప్యంలో ఉన్న కళాకారులకు పింఛను సౌకర్యం కల్పించాలన్నారు. జీవిత బీమా, హెల్త్‌కార్డు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కళాజాత కార్యక్రమాలకు వెళ్లడానికి ఉచిత బస్సు పాసులు, రైల్వే పాసులు ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కళాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించాలన్నారు. నిరుపేద కళాకారుల పిల్లలకు కార్పొరేట్ సంస్థల్లో ఉచిత విద్యను అందించాలన్నారు. ప్రభుత్వ ప్రచార మాధ్యమాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలని.. డీపీఆర్ఓ ద్వారా నెలకు 20 రోజుల పని దినాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రొయ్యపల్లి రవి, ఎర్రవల్లి బాలనరసింహులు, మరిగాని యాదగిరి, జిల్లాస్థాయి మహిళ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ వాహనం చోరీకి యత్నం

అతివేగంతో వెళ్లి డివైడర్‌కు ఢీ

నవ తెలంగాణ - కొండపాక



అంబులెన్స్ చోరీకి యత్నం చేసి అడ్డంగా దొరికిపోయాడు. కొండపాక గ్రామానికి చెందిన నవీన్ అనే వ్యక్తికి చెందిన ప్రైవేటు అంబులెన్స్ సిద్దిపేటలో నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగా ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద నిలిపి లోపలికి వెళ్ళాడు. వాహనానికే తాళం చెవి ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తి అంబులెన్స్‌ను తీసుకొని సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు అతివేగంగా వెళ్ళాడు. దుద్దెడ దాటి హైదరాబాద్ వైపు ముందుగా టోల్ గేట్ ఉందని భావించి దొరికిపోతానని యూటర్న్ చేసుకొని మళ్లీ సిద్దిపేట వైపు వెళ్తూ దుద్దెడ శివారులో డివైడర్లకు ఢీకొట్టాడు. దాంతో అంబులెన్స్ వాహనం పూర్తిగా ధ్వంసం అయింది. చోరీకి యత్నించిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఆ వ్యక్తిని టోల్ గేట్ అంబులెన్స్‌లో సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. రేభర్తికి చెందిన అశోక్‌గా గుర్తించారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాల్టీ పరిధిలో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ బుధ వారం పర్యటించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మేళ్ల చెరువు వద్ద జరుగుతున్న శుభ్రత పను లు, మే ఫైర్ వద్ద రోడ్లను అలాగే మున్సి పాలిటీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల ను పరిశీలించారు. స్వచ్ఛదనం- పచ్చ దనం కార్యక్రమంలో భాగంగా తెల్లపూర్ మున్సిపల్ కార్యాలయంలో కొల్లూరు వెటర్నరీ డాక్టర్ శిరీష, వార్డు అధికా రులకు వీధి కుక్కలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం రామచంద్రాపురం తహసీల్దార్ సంగ్రామరెడ్డి, తెల్లపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, ఏఈ సాయి మౌనిక, మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలను నాటారు.

జనగాం న్యాయవాదులపై దాడిని ఖండిస్తూ నిరసన



నవతెలంగాణ-సంగారెడ్డి

జనగామ న్యాయవాదులు అమృత్‌రావు, కవితలపై జరిగిన దాడిని ఖండిస్తూ సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా కోర్టు ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సంద ర్భంగా ఫెడరేషన్ఆఫ్ బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, సంగారెడ్డి బార్ అసోసి యేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడి చేసిన సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని.. వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సూర్ రెడ్డి, అంబరీష్, రమేష్, అశోక్, ఆంజనేయులు, లలిత, మాధవి, వీర మహేందర్, నిజామొద్దీన్, జ్ఞానోబా, పెంటయ్య, రమాదేవి, వినోద్ కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వీట్‌హౌస్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో బుధ వారం జరిగిన భాగ్యలక్ష్మి స్వీట్‌హౌస్ ప్రారంభోత్సంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, గుర్రపు మచ్చేందర్, కలుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్య క్షులు అంజా గౌడ్ పాల్గొని.. దుకాణ యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన దుకాణ యజమాని జ్ఞానేశ్వర్.. ప్రముఖులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ రాష్ట్ర ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మెన్ బాషిత్, మండల తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్ నాయ క్, నాగల్గిద్ద తాజా మాజీ వైస్ ఎంపీపీ పండరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-కల్హేర్

గతనెల రోజుల క్రితం అమెరికా పర్యటనకు వెళ్లిన నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి.. పర్యటనను విజయవంతంగా ముగించుకొని స్వదేశానికి వచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఖానాపూర్(కె)లోని భూపాల్‌రెడ్డి స్వగృహంలో కల్హేర్ మండలంలోని రాపర్తి గ్రామ మాజీ సర్పంచ్ ఎం.శ్రావణ్ కుమార్, నిజాంపేట మండ లంలోని బాచేపల్లి గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పెంటయ్య, యువ నాయకులు ప్రవీణ్, బాల రాజు, అశోక్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమ ంలో పాండు, కృష్ణ, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ మాజీ ఎంపీటీసీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డి సేవలు అభినందనీయం



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

మండలంలోని చాప్ట(కె) గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్ర మానికి కాంగ్రెస్ డీసీసీ ప్రధాన కార్య దర్శి పట్లోళ్ల చంద్ర శేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా కృష్ణా రెడ్డి సేవలు అభిన ందనీయమన్నారు.. విరమణ అనంతరం కూడా కుదిరినప్పుడల్లా పేద విద్యార్థులకు విద్య అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ ప్రధాన కార్యదర్శి పెట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు రమేష్ చౌహన్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

దళారులు చెబితేనే రైతులకు రుణాలు!

నవతెలంగాణ-మనూర్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇటీవలే రుణమాఫీ చేసిన విషయం విధితమే. అయితే మాఫీ అయిన రైతులు కొత్త రుణాల కోసం బ్యాంకులకు వెళ్తే బయటి దళారులను కలవండి.. వారి చెబితే లోన్‌లు వస్తాయని కొందరు బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. లోన్ కోసం బ్యాంకులకు వెళ్తే.. దళారీతో వెళ్లిన వారికి లోన్‌లు ఇస్తున్నారని.. దళాలరులను కలవని వారిని బ్యాంకు బయటే వేచి వేచి ఉంచుతున్నారన్నారు. ఖేడ్‌లో రెండు ఏపీజీవీబీ బ్యాంకు బ్రాంచ్‌లు ఉన్నాయి. ఆ బ్యాంకు పరిధిలో గల ఎస్గి, ఔదాతపూర్, కారసగుత్తి, శిఖరఖానా, కారముంగి, మావినల్లి, గోందేగావ్ తదితర గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉంటా యి. ఆయా గ్రామాల రైతులు లోన్‌లు తీసుకోవాలంటే.. ఈ దళారీ వ్యవస్థ అడ్డు పడుతన్నదని పలువురు రైతులు వాపోతున్నారు. దళారులతో బ్యాంకు సిబ్బంది కలిసి రైతుల నుంచి కమీషన్ తీసుకుని కొత్త లోన్‌లు మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దళారులను కలవని రైతులు మాత్రం బ్యాంకుల ఎదుటే పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

చేనేత దినోత్సవ ర్యాలీలో పాల్గొన్న జోగిపేట మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-జోగిపేట

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ లో జోగిపేట చేనేత సహకార సంఘం అధ్యక్షులు వరకల అశోక్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేతలను ఆదుకునేం దుకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

కుక్కల బెడదను నియంత్రిస్తాం



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండలంలోని ప్రతీ గ్రామంలో కుక్కల బెడద ఎక్కువయిందని.. త్వరలోనే వాటిని నియంత్రిస్తామని ఎంపీడీఓ ఆనంద్‌మేరీ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి మండలంలో కుక్కల బెడద ఎక్కువైందని.. దాంతో ప్రజలు భయాందోళన మధ్య కాలం వెల్లదీస్తున్నారన్నారు. కుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామన్నారు. త్వరలోనే కుక్కల బెడదను నియంత్రిస్తామన్నారు. అలాగే ప్రతీ ఒక్కరూ జాగ్రత్త వహించాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రతకు అందరూ కృషి చేయాలి



నవతెలంగాణ-మనూర్

పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ అవేలు మంగు అన్నారు. మండలం లోని బాధలగావ్ గ్రామంలో 'స్వచ్ఛ దనం-పచ్చదనం' కార్యక్రమాన్ని బుధ వారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ పాటుపడాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చెత్త చెదారం రోడ్లపై వేయొద్దన్నారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో సమన్వయంతో ముందుకెళ్దాం



నవతెలంగాణ-న్యాల్‌కల్

గ్రామ పరిశుభ్రతకు గ్రామస్తులు, యువకులందరూ సమన్వయంతో ముందుకెళ్దామని గంగ్వార్ గ్రామ స్పెషల్ ఆఫీసర్, ఉప తహసిల్దార్ రాజిరెడ్డి అన్నారు. గంగ్వార్ ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా కార్యదర్శి, గామస్తులతో కలిసి బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు మొక్క లు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ వివేక్, ఏపీఓ రంగారావు, హనుమంతు, గ్రామస్తులు పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

రేజింతల్ ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో విద్యార్థులకు వైద్యులు బుధవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆరోగ్యం పట్ల విద్యార్థులు జాగ్రత తీసుకోవాలని వైద్యులు సూచించారు. కాగా ముగ్గురు విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రఘునాథ్, పాఠశాల చైర్మన్ రామేశ్వరి, వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- కలెక్టర్ క్రాంతి వల్లూరు
- సదాశివపేట కమ్యూనిటీ ఆసుపత్రి, కస్తూరిబా పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం





నవతెలంగాణ-సదాశివపేట

పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను అరికట్ట వచ్చని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా బుధవారం సదాశి వపేట మున్సిపాల్టీ పరిధిలోని ఐదో వార్డులో జరిగిన మొక్క లు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం.. పచ్చదనాన్ని పెంపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఈనెల5 నుంచి 9 వరకు గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్య సమస్య పూర్తిగా పరి ష్కరించనున్నట్టు తెలిపారు. అనంతరం ప్రజలు కూడా వారి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరుచేసి మునిసిపల్, పంచాయతీ వాహనాల్లో వేయాలన్నారు. పరిసరాలలో చెత్త, నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడేగా నిల్వ ఉన్న నీటిని మొత్తం తొలగించాలన్నారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేసి.. దోమల వృద్ధిని అరికట్టా లన్నారు. రెండు మూడ్రోజులకొకసారి ఫాగింగ్ చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

అనంతరం పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, కమ్యూ నిటీ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. టీచర్లు చెప్పేపాఠాలు అర్థమౌతున్నాయా అనిఅడిగారు. పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కస్తూర్బా పాఠశాలలో తరగతి గదులు, హాస్టల్ గదుల్లో అవసరమైన మరమ్మతులు చేయాలని.. వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకో వాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. సదాశివపేట మున్సిపల్ పరిధిలో డంపింగ్ ఏర్పాటుకు స్థల సేకరణ జరపాలని అధిక ారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని కమ్యూనిటీ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వైద్యులు రోగులకు ఎలాంటి వైద్యం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. వర్షాకాలం సీజన్ అయినందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నియంత్ర ించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకో వాలని.. పడిన వారికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందిం చాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్వో గాయత్రి, డీసీహెచ్ఓ, తహసీల్దార్ సరస్వతి, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాణిక్‌రావుకు ఘన స్వాగతం



నవతెలంగాణ-జహీరాబాద్

అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది.. పూర్తిగా కోలుకుని జహీరాబాద్‌కి విచ్చేసిన ఎమ్మెల్యే కోనింటి మాణిక్‌రావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన ంగా స్వాగతం పలికారు. అలాగే క్యాంపు కార్యాల యంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమా లలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సంద్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ.. తన కోలుకోవాలని పూజలు, ప్రార్థనలు చేసిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు ఉద్యమ కారుడు నామ రవికి రణ్, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బండి మోహన్, మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, మాజీ కౌన్సిలర్ అబ్దు ల్లా, పట్టణ మహిళ అధ్యక్షురాలు మంజుల, పద్మజ, ఎస్సీ సె ల్ పట్టణ అధ్యక్షులు శివప్ప, సీనియర్ నాయకులు కలేం, ప్రభు, తులసి దాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను దిగ్విజయం చేయాలి

- పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ జాన్‌వెస్లీ
- మిర్జాపూర్ (బి), గంగ్వార్ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీ
- చెత్త సేకరణ తీరుపై అధికారుల మీద మండిపాటు



నవతెలంగాణ-న్యాల్‌కల్

'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులను భాగస్వామ్యం చేసుకొని.. పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ జాన్‌వెస్లీ ఆదేశించారు. మండల ంలోని మిర్జాపూర్(బి), గంగ్వార్ గ్రామ పంచాయతీలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జరిగిన పనుల గురించి ఎంపీ డీవో, ఈజీఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గంగ్వార్ గ్రామంలో డంపింగ్ యార్డ్, తడి, పొడి చెత్త సేకర ణలో కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి అలాంటివి జరగొద్దని హెచ్చరించారు. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకో వాల ని సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టి.. ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదే శించ ారు. డీఎస్‌కే పంచాయతీ కార్యదర్శుల దగ్గర ఉంచు కోవా లని మండిపడ్డారు. కాగా ఆయన్ను గ్రామ నాయకు లు, ఉప తహసీల్దార్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ తనిఖీల్లో డీఎల్పిఓ అమృత, ఉపతహసీల్దార్ రాజిరెడ్డి, ఎంపీ డీవో సురేష్, ఈజీఎస్ ఏపీవో రంగారావు, పంచా యతీ సెక్రటరీలు వివేక్, రాంప్రసాద్, గంగ్వార్ బలవంత్ రెడ్డి,విట్టల్, రత్నం, పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట మండలంలోని టేట్టకుంటతాండాకు చెం దిన మంజులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.13,500 చెక్కును మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న ప్పుడు వేల సంఖ్యలో ఖేడ్ నియోజకవర్గానికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించి.. తానే స్వయంగా ఇంటిం టికి తిరిగి అందజేసినట్టు తెలిపారు. ప్రస్తుతం తాము అంద జేస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు గత ప్రభు త్వహయాంలో మంజూరైనవే అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క కొత్త సీఎంఆర్ఎఫ్ చెక్కును కూడా మంజూరు చేయలేదన్నారు. వెంటనే పెండింగ్ లో ఉన్న సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేసి లబ్దిదారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అమర్య నాయక్, మాజీ సర్పంచ్ రవీందర్, ఎం. శ్రావణ్ కుమార్, కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సురేష్, నాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి సమ్మెపై ఎంపీడీఓ కార్యాలయంలో వినతి



నవతెలంగాణ-కొండాపూర్

తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నేడు(గురువ ారం) చేపట్టనున్న సమ్మెలో ఒకరోజు పాల్గొంటామని ఎంపీడీఓ కార్యాలయంలో జీపీ కార్మికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ.. గత ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ పేరుతో తీసుకొ చ్చిన విధానం వల్ల.. నైపుణ్యం లేని పనులు చేయాల్సి వస్తోందన్నారు. ఈ క్రమంలోనే విద్యుత్తు స్తంభాలెక్కి, ట్రాక్టర్ నడిపి ప్రమాదాలకు గురై అనేక మంది కార్మికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా అన్ని తరగ తుల ఉద్యోగులకు గత ప్రభుత్వం వేతనాలు పెంచి.. పంచా యతీ కార్మికులను విస్మరించిందన్నారు. ఈ ప్రభుత్వమైనా.. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయ తీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషన ర్‌ను అనేకమార్లు కలిసి వినతి పత్రాలు కూడా అందజేశామ న్నారు.కానీ ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపో వడంతో.. నేటి సమ్మెకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. కాగా నిరసనలో గ్రామపంచాయతీ కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల మండలాధ్యక్షులు సంజీవులు, ప్రధాన కార్యదర్శివెంకయ్య రవి,బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలివ్వాలి

- డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్
- డీవైఎఫ్ఐలో పలువురి యువకుల చేరిక



నవతెలంగాణ-కొండాపూర్

మండలంలోని పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పలువురు యవకులు బుధవారం డీవైఎఫ్ఐలో చేరగా.. వారికి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనం తరం అనిల్ మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐ యువజన సంఘం యువతీ యువకుల, విద్యార్థుల సమస్యల పైన జిల్లా వ్యాప్త ంగా పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. మండలంలో అనేక మైన పరిశ్రమలు ఉన్నాయని.. వాటిల్లో ఈ ప్రాంతానికి సంబంధించిన యువకులను ఉద్యోగాల్లో నియమించు కుండా వేరే రాష్ట్రాలకు చెందిన వారిని నియమించడం సరి కాదన్నారు. ఇక్కడి వనరులను, భూములను పరిశ్రమల కోసం త్యాగం చేసిన కుటుంబాల యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా అన్యాయం చేయడం కరెక్ట్ కాదన్నారు. ఈ ప్రాం తంలో నడుస్తున్న పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించడం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున డీవైఎఫ్ఐ ఆధ్వ ర్యంలో ఆయా పరిశ్రమల ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కాగాఎండి మోహిన్ పాషా, సురేందర్, ఎండి ఆబిద్ అలీ, రాజు,శ్రీశైలం,ఎల్లేష్ కుమార్, ప్రమోద్‌లు డీవైఎఫ్ఐ సంఘంలో చేరారు. ఈ కార్యక్రమంలో రైతు సం ఘం సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజయ్య, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి దుర్గంధం

- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పుల్కల్ ప్రజలు



నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రమైన పుల్కల్‌లో మురుగునీటి దుర్గం ధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అపరిశు భ్రత వల్ల ఎక్కడిపడితే అక్కడ మురుగునీరు నిల్వకు ఉండి.. దుర్వాసన వెదజల్లుతున్నది. దాంతో దోమల సంతతి పెరిగి .. ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. కాగా ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకె ళ్లినా.. పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తు త వానాకాలం సీజన్ కాబట్టి.. డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నదని భయాందళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పంది ంచి.. మురుగు నీటి నిల్వలపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంధకారంలో దళిత కాలనీ..

- ప్రధాన రహదారులపై పగలే వెలుగుతున్న స్ట్రీట్‌లైట్లు

నవతెలంగాణ-వట్‌పల్లి

మండలంలోని గొర్రెకల్ గ్రామంలో దళితకాలనీ అంధ కారంగా మారింది. మరోపక్కఅదే గ్రామంలో ప్రధాన రహ దారుల వెంట, దేవాలయాల వద్ద ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్లు పట్టపగలే వెలుగులు విరజిమ్ముతుండడం గమనార్హం. పగలే వీధి దీపాలలు వెలుగుతున్నా.. సంబంధిత అధికా రులు చూచి చూడనట్లు వ్యవహరి స్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దాంతో విద్యుత్ వృథా అవుతున్నదని..



ప్రధాన రహదారిపై పగటిపూట వెలుగున్న లైట్లు



దళితకాలనీలో వెలగని లైట్లు..

మరోపక్క నెల రోజులుగా దళితకాలనీ, బీసీ కాలనీలో వీధిదీ పాలు వెలగక చీకటి నెలకొన్నది. ఆయా కాలనీల్లో వీధి దీపాలు అమర్చాలని సంబంధిత కార్యదర్శికి మొరపెట్టు కోగా.. నిధులలేమితో వీధి దీపాలను పెట్టలేకపోతున్నామని సమాధానం ఇస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధి కారులు స్పందించి.. విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపా లని స్థానికులు కోరుతున్నారు. అలాగే పట్టపగలే విద్యుత్ దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-పుల్కల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛద నం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతీ గ్రామంలో నిర్వహించి విజయవంతం చేయాలని పుల్కల్ ఎంపీడీఓ ఆనంద్ మేరీ అన్నారు. పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని ఆయా గ్రామ ాల్లో బుధవారం ఆమె పర్యటించి.. స్వచ్ఛదనం పచ్చ దనం కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించింది. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటితోపాటు పరిసరా లను సైతం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి ఇంటి ముందు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఐదు రోజులపాటు జరిగే స్వచ్ఛదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. కార్యక్రమాల్లో పలు శాఖల అధికారులు, కార్యదర్శిలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

బోదకాల నివారణకు మందుల పంపిణీ



నవతెలంగాణ-గుమ్మడిదల

దోమ కాటు వల్ల బోదకాలు వచ్చే ప్రమాదం ఉందని.. వాటి నివారణ కోసం మందుల పంపిణీ చేపట్టనున్నట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కానుకుంట డాక్టర్ ప్రత్యూష వెల్ల డించారు. గుమ్మడిదల మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆగస్టు 10 నుంచి 25 వరకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పరచుకుని ప్రతీ గడపకు వెళ్లి మందుల పంపిణీ చేస్తామన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ప్రత్యూష మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాల నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చిన ప్రజల నుంచి దోమకాటు వల్ల ఇక్కడి వారికి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉన్నదన్నారు. అందుకే ముందస్తుగా మందులు పంపి ణీ చేయన్నుట్టు తెలిపారు.రెండేండ్ల పైబడిన వారి నుండి 90 ఏండ్ల వయస్సు ఉన్న వారిని వయస్సు, ఎత్తును బట్టి మూ డు కేటగిరీల విభజించి మందులను పంపిణీ చేస్తామ న్నారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించి మందులను వేసుకోవాలని సూచించారు.

ఇటుక రాజు మాదిగకు ఘన సన్మానం



నవతెలంగాణ-సదాశివపేట

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ.. న్యూఢిల్లీలోని జంత ర్మంతర్ వద్ద టి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల విజయో త్సవ ర్యాలీని విజయవంతం చేసిన టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఇటుక రాజు మాదిగాను బీసీవై పార్టీ సంగారెడ్డి జిల్లా ఇన్చార్జి న్యాయవాది కోవూరి సత్యనారాయణ గౌడ్, మెదక్ పార్లమెంట్ కాంటెస్టెడ్ ఎంపీ సాయగౌడ్, ఉమ్మడి మెదక్ జిల్లా టి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు కోలుపుల రత్నయ్య మాదిగలు శాలువాతో బుధవారం ఘనంగా సన్మానిం చారు. అదేవిధంగా రాజు మాదిగకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ.. మందకృష్ణ మాదిగతో పాటు 30 ఏళ్ల సుదీర్ఘ పోరా టం చేసిన టీ ఎమ్మార్పీఎస్ నాయకులకు ప్రత్యేకంగా ధన్యవ ాదాలు తెలిపారు. అనంతరం కోలుపుల రత్నయ్య మాట్లాడ ుతూ.. మందకృష్ణ మాదిగ చేసిన 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటా న్ని అర్థం చేసుకున్న ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా టి ఎమ్మార్పీఎస్ ఉద్య మ పోరాటాలకు ఎప్పుడు ముందుంటానని మాదిగల అభి వృద్ధికి తోడ్పడుతానని సభా ముఖంగా చెప్పారు.

సర్వేయర్ తీరుపై స్థానికుల ఆగ్రహం

నవతెలంగాణ-హత్నూర

మండల సర్వేయర్ ప్రవర్తన డబ్బున్నోళ్లకు ఒకలాగా లేనోళ్లకు మరోలా ఉన్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సర్వే చేయాలని ఫోన్‌లు సంప్రదించాలని ప్రయత్నిస్తే ఫోన్ లేప డని.. తారసపడినా కనీసం మాట్లాడడని మండి పడుతున్నారు. ఆయనది మండల కేంద్రానికి పక్కనే ఉన్న దౌల్తాబాద్ గ్రామం కావడం.. రాజకీయ అండదండలు ఉం డడంతో కార్యాలయానికి కూడా సరిగ్గా రావడం లేదని ఆరో పించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు సర్వేయర్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమానికి తూట్లు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

ప్రభుత్వం అట్టహాసంగా చేపట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' అనే కార్యక్రమానికి అధికారులే తూట్లు పొడుస్తున్నారని 22వ వార్డు కౌన్సిలర్ వి. శ్రీకాంత్ యాదవ్ ఆరో పించారు.ఈనెల 5వ తేదీ నుంచి 9వతేదీ వరకు నిర్వహిం చనున్న ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు ఘనంగా ప్రారంభించారు తప్పా.. ఏ వార్డులోనూ పనులు జరిగిన పాపాన పోలేదన్నారు.ముఖ్యంగా తాను ప్రతినిధ్యం వహిస్తున్న బొల్లారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు మల్లన్న బస్తీలో ఇప్పటివరకు చెత్త తొలగించలేదని, పారిశుధ్య పను లు సక్రమంగా నిర్వహించడం లేదని, దోమల నివారణకు పొగ వెదజల్లే కార్యక్రమం చేపట్టలేదని ఆరోపించారు. ఈ విషయమై పిర్యాదు చేసేందుకు అధికారులను సంప్రది ంచగా ఒకరిపై ఒకరు నెపం వేసి సమస్యను పరిష్కరిం చకు ండా తప్పించుకుంటున్నారన్నారు.ఇప్పటికైనా జిల్లా అధి కార ులు స్పందించి.. బొల్లారంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్య పనులను సమీక్షించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య మెదక్ జిల్లానే లక్ష్యంగా పనిచేయాలి

- సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-మెదక్ టౌన్

ఆరోగ్య మెదక్ జిల్లానే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రధాన వార్డ్‌లు, కూడళ్ల వద్ద బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛదనం- పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇండ్లోని పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వస్తువుల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుతామో అదే విధంగా మన గ్రామాన్ని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలాన్నారు. విద్యుత్ లైన్లు, త్రాగునీటి సరఫరా పైప్ లైన్లకు దూరంగా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు నాటాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య మున్సిపల్ చైర్మన్ సంబంధిత మున్సిపల్ కమిషనర్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 3

మెదక్

గురువారం | 08 ఆగస్టు 2024 | www.navatelangana.com

దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటు



నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలో దోమకొండ అనంతరాములు, విజయ ప్రసాద్‌ల జ్ఞాపకార్థంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు దాత వెంకటరమణ తెలిపారు. జీడిపల్లి గ్రామంలో వరసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. దీన్ని బాధాకరమైన విషయంగా భావిస్తూ దోమకొండ వెంకటరమణ తన వంతు సహకారంగా జీడిపల్లి, గొల్లగడ్డ (గోకుల్ నగర్)లో ముఖ్యమైన చౌరస్తాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు, గ్రామస్తులు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కత్తుల వెంకటేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

నవతెలంగాణ-కౌడిపల్లి



మండల కేంద్రమైన కౌడిపల్లిలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిష్కె నర్సింలు ఆధ్వర్యంలో పద్మశాలీలు కౌడిపల్లిలోని పద్మశాలి భవనం వద్ద మార్కండేయ మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చేనేత జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా నర్సింలు మాట్లాడుతూ పద్మశాలిలు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. ప్రభుత్వం పద్మశాలిలకు స్వయం ఉపాధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా యువత ఉపాధ్యక్షులు సంబరపు తిరుమలేష్, నాయకులు పద్మ దుర్గయ్య, పోల నవీన్, కోమటి సాలె శ్రీనివాస్, మంత్రి కృష్ణ, సగ్గం భీమేష్, పొన్న వెంకటేశం, పొన్న శంకరయ్య, ఆరగొండ నర్సింలు, పద్మ సత్యనారాయణ, పోల లక్ష్మణ్, మంత్రి గంగారాం, పిష్కె రంగేశ్, పోల శ్యామ్, రవి, శ్రీను, కృష్ణ, మంత్రి ఆంజనేయులు, పిష్కె శ్రీనివాస్, ఆరగొండ రాజు, పద్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి కరుణించినా లక్ష్మీ అడ్డుపడింది

నవతెలంగాణ-నిజాంపేట



సరస్వతి దేవి కరుణించినా కానీ లక్ష్మీ దేవి అడ్డుపడింది. మండలపరిధిలోని చల్మేడ గ్రామానికి చెందిన రాగుల సాయి కుమార్ దళిత (మాల) సామాజిక వర్గానికి చెందిన విద్యార్థి. ఈ విద్యార్థి జెఈఈ మెయిన్స్‌లో ఎస్సీ కేటగిరీలో 4000ల ర్యాంక్ సాధించాడు. ఈ ర్యాంక్ ద్వారా బీటెక్, ఎంటెక్ ఐదు ఏళ్ల సీవిల్ ఇంజనీరింగ్ చదవడానికి కళాశాలలో సీటు వచ్చింది. కానీ అతనికి ఏడాదికి రూ.1.70 లక్షల వరకు ఖర్చు అవుతాయని, ఇలా ఐదేళ్లకు సుమారు రూ. 10 లక్షల వరకు ఖర్చవుతున్నది. ఆర్థిక స్థోమత లేక పోవడంతో ఉన్నత విద్య చదవడానికి సతమతమవుతున్నాడు. జెఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంక్ సాధించిన తన కుమారుడు ఎస్ఎస్‌సీ రామాయంపేట మోడల్ స్కూల్‌లో చదివాడని. ఎస్ఎస్‌సీలో 9.7 జీపీఎ సాధించి ఇంటర్మీడియట్ కరీంనగర్ ప్రభుత్వ కళాశాలలో చదివాడని విద్యార్థి తండ్రి బాబు తెలిపారు. ఇలా ప్రభుత్వ స్కూల్‌లలో చదివి మంచి ర్యాంక్ సాధించిన తన కుమారుడిని పై చదువులు చదివించే ఆర్థిక స్థోమత తనకు లేదని అతని తండ్రి బాబు ఆవేదన వ్యక్తం చేశాడు. తన కుమారుని చదువుకు ఎవరైనా దాతలు సహకరించాలని విద్యార్థి తండ్రి బాబు కోరుతున్నాడు.

ఉద్యోగులకు బదిలీలు సహజం

నవతెలంగాణ-మనోహరాబాద్



ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని అక్కడ ఉన్న సమయంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని గ్రామ యువకులు తెలిపారు. బుధవారం జీడిపల్లి గ్రామంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో భాగంగా బదిలీపైన వెళ్లిన టీచర్లను ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ పద్మ, స్కూల్ చైర్మన్ లక్ష్మి, గ్రామ సెక్రటరీ సత్యనారాయణ, కారోబార్ అబీబ్ ఖాన్, యువకులు రాజు, శ్రీకాంత్, నవీన, నాగరాజు, అరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో మల్లారెడ్డి వారి మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ-చేగుంట



చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో మల్లారెడ్డి హాస్పిటల్ వారి సౌజన్యంతో రావుల రమేష్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ద్వారా 168 మంది పేషేంట్స్‌కు డాక్టర్ త్రిభువన్, రుత్విక్‌లు పరీక్షలు చేసి వారికి ఉచితంగా రూ.23,000 విలువైన మందులు అందించారు. 63 మంది రోగులకు వివిధ శస్త్ర చికిత్సలకై మల్లారెడ్డి హాస్పిటల్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బుర్క నాగరాజు, ఫాస్ట్ ప్రెసిడెంట్ రామ్ రెడ్డి, నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ ఆకుల సంజీవ్, సభ్యులు సూర్య ప్రకాష్, నాగేశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-పాపన్నపేట

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్‌లు వెల్లడించారు. ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 10 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో అడ్మిషన్ కావడానికి అవకాశం ఉందని వారు తెలిపారు. పూర్తి వివరాలకు 9912335581 నెంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ-హవేలిఘనాపూర్:



మెదక్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించడానికి బయలుదేరిన ఓ కానిస్టేబుల్‌కు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఫరీద్ పూర్ గ్రామానికి చెందిన బానోత్ దుర్గపతి (50) మృతి చెందాడు. విధులు నిర్వహించేందుకు మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌కి వెళుతుండగా కూచన్ పల్లి గ్రామ శివారు మగ్గంపూర్ ఎక్స్ రోడ్ వద్ద కుక్క తన బైక్‌కు అడ్డం రాగా తప్పించబోయి ప్రమాదానికి గురయ్యాడు.గ్రామానికి చెందిన వ్యక్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మెదక్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించాడని వైద్యులు ధృవీకరించారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. కానిస్టేబుల్ దుర్గపతి మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్‌కి నివాళులు

- జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-హవేలి ఘనాపూర్



మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించడానికి వెళ్తు కూచన్ పల్లి గ్రామ శివారులోని రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్గపతి (50) మృతి చెందాడు. విషయం తెలియగానే జిల్లా ఎస్‌పిడి.ఉదయ్ కుమార్ రెడ్డి బుధవారం ఫరీద్‌పూర్ గ్రామానికి వెళ్లి కానిస్టేబుల్ దుర్గపతి మృతదేహానికి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అంత్యక్రియ ఖర్చులకుగాను రూ.20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ దుర్గపతి మరణ వార్త జిల్లా పోలీస్ యాంత్రాంగాన్ని కలచివేసిందన్నారు. కానిస్టేబుల్ సతీమణి మంజులను ఓదార్చి, అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్‌లు దరించాలని కోరారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పైతర పంచాయతీకి కార్యదర్శిని నియమించండి

- కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కొల్చారం

గత కొన్ని రోజులుగా పైతర గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి లేక పారిశుధ్యం ఎక్కడికక్కడ పడకేసింది. దీంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ బదిలీ కావడం పట్ల పారిశుధ్య పనుల నిర్వహణపై పర్యవేక్షణ కొరబడిందని తెలిపారు. దీంతో గ్రామంలో దుర్వాసన విరజల్లుతోందని ప్రజలకు సీజనల్ వ్యాదులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఇందుకు వెంటనే స్పందించిన కలెక్టర్ నూతన పంచాయతీ కార్యదర్శిని నియమించాలని ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు కుమ్మరి భూమయ్య, కుమ్మరి శివకుమార్, మాడబోయిన శేఖర్, మిద్దె లక్ష్మీనారాయణ, ఆకుల కార్తిక్ రాజు తదితరులు ఉన్నారు.

దూప్ సింగ్ తండా బ్రిడ్జి పనులు సత్వరమే పూర్తి చేయాలి

- స్వచ్ఛదనం పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

దూప్ సింగ్ తండా బ్రిడ్జి పనులు సత్వరమే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని మండలం ధూప్ సింగ్ తండాలో నిర్వహించిన స్వచ్ఛధనం, పచ్చదనం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధూప్ సింగ్ తండాలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించారు. మొక్కలు నాటి నీరు పోశారు. ధూప్ సింగ్ తాండ మార్గమధ్యలో ఉన్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ దూప్ సింగ్ తాండ బ్రిడ్జి పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. పచ్చదనం పరిశుభ్రత వల్ల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఆరోగ్య మెదక్ జిల్లా అనే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ పచ్చదనం పెంపు లక్ష్యాలతో ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో మంచి ఫలితాలు సాధించాలని, నర్సరీలో మంచి మొక్కలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన మేర గ్రామంలో పచ్చదనం పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం, ఈ కార్యక్రమాలను క్రమం తప్పకుండా చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పారిశుధ్య నిర్వహణ పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమం ద్వారా ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని ఆ దిశగా మనమంతా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దడపుట్టిస్తున్న దోమలు

- పత్తాలేని ఫాగింగ్
- నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు



నవతెలంగాణ-పాపన్నపేట

వర్షాకాలం వచ్చిందంటే చాలు పాపన్నపేట మండలంలోని పలు గ్రామాలలో దోమలు దడ పుట్టిస్తున్నాయి. సాయంత్రమైతే చాలు దోమలు ఇంట్లోకి చొరబడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. ఎన్ని మస్కిటో కాయిల్స్ పెట్టినా ఉపయోగం లేకుండా పోతోంది. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతి ఏడాది అధికారులు కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా దోమల నుంచి తప్పించుకోలేక పోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువలలో వ్యర్థాలు పేరుకుపోవడం, పూడిక తీసిన వ్యర్థాలు అక్కడే వదిలేయడంతో దోమల బాధ విపరీతంగా పెరిగిపోతుంది. గ్రామ కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో పాటు ప్రజలు దోమ కాటు బారిన పడి ప్రాణాంతకమైన మలేరియా, డెంగ్యూ జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం వచ్చిందంటే ఇది మలేరియా, డెంగ్యూ జ్వరమేనేమో అని భయపడి పోతున్నారు. సిబ్బంది చెత్తను, మురికి కాలవలను శుభ్రం చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాలలో డ్రయినేజీలు పొంగి ఆ నీరంతా రోడ్లపైకి రావడంతో మురికి కూపాలుగా మారి దోమలు బాగా వృద్ధి చెందుతున్నాయి.

దోమలతోనే భయంకరమైన వ్యాధులు

డెంగీ, మలేరియా ఎల్లో ఫీవర్, జికా వైరస్ లాంటి భయంకరమైన జబ్బులు ఈ దోమల ద్వారానే వ్యాపిస్తాయని డాక్టర్లు చెబుతున్నారు. మెదడు నాడీ వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతాయని ఈ దోమలు కుట్టడం వల్ల అనారోగ్యాల పాలవుతారని గర్భిణీలు, చిన్నపిల్లలు ఈ కాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి ఏటా ఏడుపాయల, తదితర గ్రామాల్లో జనాన్ని దోమలు, సీజనల్ వ్యాధుల, బారిన పడేసి ఆర్థికంగా ఆరోగ్యపరంగా చాలా నష్టపరుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ఫాగింగ్ చేయడంతో పాటు పరిసరాలను శుభ్రం చేసి ఈ దోమల దడ నుంచి తమను రక్షించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు

ఘనంగా కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు

నవతెలంగాణ-నిజాంపేట

తల్లి వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. వంజరి సంఘంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఐసీడీసీ సీడీపీఓ స్వరూప, ధర్మారం డాక్టర్ హరిప్రియ, ఆర్ఐ గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు అందించాలని, తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని తెలిపారు. తల్లిపాల విశిష్ట గురించి అవగాహన కల్పించారు. అనంతరం సీమంతాలు అక్షరాభ్యాసం, అన్నప్రాసన్న కార్యక్రమాలు నిర్వహించామని సూపర్వైజర్ లక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ వసంత, పిహెచ్ ఏ రాణి మనోహర్, ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఏఎన్ఎంలు అనురాధ, బాలమని, అంగన్వాడీ టీచర్లు అరుణ, సుగుణమ్మ, రేణుక, మణెమ్మ దుర్గేశ్వరి, ఆశా వర్కర్లు బండారి లక్ష్మి, కొమ్మాట బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలోని గ్రంథాలయంలో అంగన్వాడి ప్రాజెక్ట్ సూపర్వైజర్ శివకుమారి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూప్రాన్ మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపారు. గర్భిణీగా ఉన్న సమయంలో తీసుకోవలసిన పోషక ఆహారాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు పల్లెల రవీందర్ గుప్తా, మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహినుద్దిన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ-మనోహరాబాద్

మనోహరాబాద్ మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల్లులందరికి ముర్రుపాల ప్రాముఖ్యత, కేవలం ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం, ఏడవ నెల నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అదనపు ఆహారం అందించడం అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్ స్వప్న, కార్యదర్శి రూప గౌడ్, ఏఎన్ఎం వినోద, ఆశా వర్కర్లు అంగన్వాడిలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు తల్లులు పాల్గొన్నారు.







పీహెచ్‌సీలో మొక్కలు నాటిన డీఎంహెచ్ఓ

నవతెలంగాణ-నార్సింగి

మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం మండల వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో డీఎంహెచ్ఓ శ్రీరామ్, జిల్లా మలేరియా అధికారి నవీన్ కుమార్‌లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి ఆవరణలో పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, వైద్యం కోసం వచ్చే రోగులకు అనువుగా ఉందని కితాబునిచ్చారు. పరిసరాలు పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. గురువారం మండలం లో హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వే జరుపుతామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని, జిల్లా వ్యాప్తంగా 8 డెంగ్యూ కేసులు,12 టైపాయిడ్ కేసులు నమోదు అయ్యాయని, మలేరియా కేసులు ఇప్పటివరకు నమోదు కాలేదని తెలిపారు. పీహెచ్‌సీ సిబ్బంది కూడా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నారని, రక్త నమూనాలను పరీక్ష కోసం టీ హబ్‌కు పంపుతున్నారన్నారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రత, సిబ్బంది పనితీరు బాగుందని మెచ్చుకున్నారు. ఒక్క మలేరియా, డెంగ్యూ కేసు రాకుండా సిబ్బంది పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీమాలజిస్ట్ స్నేహప్రియ, ఏపీవో రాజేశ్వర్ గౌడ్, పిహెచ్ఎన్ రేణుక, ఎంపీహెచ్ఈఓ శ్రీనివాస్, ఎంపిహెచ్ఎస్ ఉమారాణి, సీనియర్ అసిస్టెంట్ అభినాష్, ఏఎన్ఎం రేణుక, స్టాఫ్ నర్సులు లక్ష్మి బాయి, పవిత్ర, రంగరాజ భట్టాచార్య, ఫార్మశిస్ట్ రాజు, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



సైబర్ క్రైమ్‌పై అవగాహన



నవతెలంగాణ-పాపన్నపేట

పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ బుధవారం కళాశాల విద్యార్థులకు సైబర్‌క్రైమ్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఒకవేళ సైబర్ క్రైమ్‌కి గురైతే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ, త్రిబుల్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా బైక్ నడపడం, తదితర అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు ఎస్ఐని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఎస్సై శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సైబర్ సెక్యూరిటీ బ్యూరోన్ ఏర్పాటు చేశారని ప్రతినెల మొదటి బుధవారం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జయపాల్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, పోలీస్ సిబ్బంది నరహరి, విజయ్, సోహెల్, చల్మేడ మాజీ ఎంపీటీసీ బాల్రెడ్డి, రెడ్డి అబ్దుల్ అజీజ్, మావురం రాజు, రెడ్డి శెట్టి రవీందర్, నరేందర్ నాయక్, నగేష్, పాల్గొన్నారు.

స్వచ్ఛదనం పచ్చదనంతో ఆరోగ్యకరమైన జీవితం

నవతెలంగాణ-తూప్రాన్

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా తూప్రాన్ మండల ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈవో సిహెచ్ ఎల్లయ్య ఘనపూర్, యావపూర్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పి సీఈఓ ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామాల్లోని మురికి కాలువలు పరిశీలించి, పలు వీధులు కలియ తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, వర్షాకాలంలో వ్యాపించే వ్యాదుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వీరితో పాటు శానిటేషన్ కమిటీల సభ్యులు, విలేజ్ గ్రామాఖ్య సంఘ మహిళలు, ఏపీఓ సంతోష్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తూప్రాన్

పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్వాడీ స్కూల్‌లో నిల్వ ఉన్న నీటిని తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వార్డులో శ్రమదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్, ఆర్పి, అంగన్వాడీ టీచర్లు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మనోహరాబాద్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శి రాజు సూచించారు. స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామంలోని ప్రధాన వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, చెత్తను తొలగించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. అలాగే ఇంటి పరిసరాలలో ఎక్కడ కూడా నీరు నిలిచి ఉండలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగునీరు నిలువ ఉంటే దోమలు, ఈగలు పెరిగి అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పరిశుభ్రతపై కార్యదర్శి రాజు ప్రజలకు అవగాహన కల్పించారు.

నవతెలంగాణ-చేగుంట

గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు. స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య బుధవారం చేగుంట, ఉల్లి తిమ్మాయపల్లి, అనంతసాగర్, రుక్మాపూర్, గ్రామాలను సందర్శించారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయంలో సఫాయి కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామాలలో పర్యటించారు. రుక్మాపూర్ గ్రామంలో గ్రామ సభలో మాట్లాడుతూ ప్రజలకు అంటూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రజలు ఈ వర్షాకాల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్పిఓ యాదయ్య, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీ ఓ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి నరేష్ కుమార్, రెడ్డిపల్లి పిఏసిఎస్ సొసైటీ చైర్మన్ మేకల పరమేష్, రుక్మాపూర్ మాజీ సర్పంచ్ స్వప్న అంజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.









సీసీ రోడ్లు వేసిండ్రు-మొరం పోయడం మరిచిన్రు

నవతెలంగాణ-నిజాంపేట



మండలంలోని గ్రామాలలో సీసీ రోడ్ల కోసం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు దాదాపు రూ. కోటి 50 లక్షలు పెట్టి సీసీ రోడ్లు వేయించారు. సీసీ రోడ్లు వేసి ఇప్పటికీ దాదాపు మూడు నెలలు అవుతున్నప్పటికీ సీసీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోయడం మరిచిపోయారు. కానీ సదరు కాంట్రాక్టర్‌కు సీసీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పోయడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. సీసీ రోడ్ల వెంబడి వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నదని మండల ప్రజలు పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ రోడ్డు వెంబడి వాహనాలు వెళ్లాలంటే ప్రమాదాలు జరుగుతున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సీసీ రోడ్డుకు ఇరువైపులా మొరం పోసేలా తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మద్యం మత్తులో కుమారుడిని రోకలి బండతో కొట్టి చంపిన తండ్రి

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



కుమారుడి మానసిక వైకల్యం భారంగా మారడంతో మద్యం మత్తులో తండ్రి కన్న కుమారుడిని రోకలి బండతో దాడి చేయడంతో కుమారుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం పెద్ద శంకరంపేటలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి. పేట ఎస్సై శంకర్‌లు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పెద్ద శంకరంపేట పట్టణంలోని ఇందిరా కాలనికి చెందిన పిరయిల సాయిలు కూలి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రదీప్ (16) మానసిక అంగవైకల్యంతో ఉండడంతో ఇది భరించలేని తండ్రి మద్యం మత్తులో రోకలి బండతో కుమారునిపై దాడి చేయగా, ప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు, పెద్ద కుమారుడు వివాహం కావడంతో పక్కనే జీవనం కొన సాగిస్తున్నారు. మృతుడి తాత పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేట ఎస్సై శంకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయు జిల్లా కోశాధికారి నర్సమ్మ

నవతెలంగాణ-మెదక్ టౌన్



రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మెదక్ జిల్లాలో ఆగస్టు 8వ తేదీన గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ఒకరోజు సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు, అధికారంలోకి వచ్చాక పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందన్నారు. వర్షాకాలం అసెంబ్లీ సమావేశాల్లో గ్రామ పంచాయతీ కార్మికుల కోసం ప్రభుత్వం ఏమి చర్చించకుండానే ముగించిందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆగస్టు 8న ఒక రోజు సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భారీ వర్షానికి వీధుల్లో పొంగిపొర్లిన మురికినీరు

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్



పెద్ద శంకరంపేటలో బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులతో కురి సిన వర్షంతో పాటు సాయంత్రానికి ఓ మో స్తారు భారీ వర్షం కురిసింది. పెద్ద శంకరం పేటలోని పాత గ్రామపం చాయతీ వీధిలో మురికి కాలువలు పొంగి పొర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదు ర్కొన్నారు. పోచమ్మ వీధిలో సైతం మురికి కాలువలు పొంగిపొరడంతో అంతర్గత రహదారులపై నీరు పొంగి పొల్లడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. పలు అంతర్గత రహదారులు బురదమయంగా మారాయి. పలువురి గృహాలలోకి మురికి నీరు ప్రవేశించగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతర్గత రహదారులు మొత్తం చిత్తడి చిత్తడిగా మారాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి పెద్ద శంకరంపేటలోని మురికి కాలువలను శుభ్రం చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతున్నారు

పోలీసులపై చర్యలు తీసుకోవాలి



- హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడుతున్న పోలీస్‌లపై చర్యలు తీసుకోవాలని హుస్నాబాద్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. బుధవారం న్యాయవాదులపై పోలీసుల భౌతిక దాడులను నిరసిస్తూ హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనగామలోని పోలీస్ స్టేషన్‌లో న్యాయవాద దంపతులపై పోలీసుల దాడి సరైనది కాదన్నారు. సిద్దిపేట, సిరిసిల్లలో న్యాయవాదులపై పోలీసులు చేసిన దాడులను మరవకముందే జనగామలో న్యాయవాదుల పై భౌతిక దాడి చేయటం బాధాకరమన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులను పోలిస్‌లు దురుసుగా మాట్లాడి వారిపై దాడికి పాల్పడడాన్ని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. పోలీస్ స్టేషన్ పోలీసుల సొంతిల్లు కాదని, కేసుల విషయమై మాట్లాడడానికి న్యాయవాదులు పోలీస్ స్టేషన్‌కు వెళితే వారిపై దాడులకు పాల్పడడం ఏంటని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇకపై న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.

తనిఖీల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు



- సీపీ డాక్టర్ బి.అనురాధ

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట పోలీస్ కమీషనరేట్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా సడ్రైజ్ వాహనాల తనిఖీలు నిర్వహించి 55 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సీపీ. డాక్టర్ బి. అనురాధ తెలిపారు. బుధవారం అనంతరం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రోడ్డు ప్రమాదాల నివారణ, అక్రమ రవాణా నివారణ కోసం వాహనాల తనిఖీ నిర్వహించి కేసులు నమోదు చేశామన్నారు. ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో సీఐలు లక్ష్మీ బాబు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, సైదా, లతీఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన అవసరం

నవతెలంగాణ-జగదేవ్‌పూర్



జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో గల అక్షర పాఠశాలలో గల విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎన్నికలపై అవగాహన కల్పించారు. బుధవారం పాఠశాలలో గల విద్యార్థుల కు ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 7వ తరగతి కి చెందిన చెందిన విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొని ప్రచారాన్ని నిర్వహించారు. సుమారుగా 320 మందికి గాను 302 మంది విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకొని పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల్లో 13 మంది విద్యార్థులు పాల్గొనగా హెడ్ బాయ్‌గా హేడ్వర్డ్ ఎన్నిక కాగా కునాల్ పూరి రెండవ స్థానంలో నిలిచారు. హెడ్ గర్ల్ గా కీర్తన గెలుపొందగా రెండవ స్థానంలో మాళవిక ఉన్నారు. ఎన్నికల సరళిని విద్యార్థులు నిశితంగా పరిశీలించారు. ప్రచారం అంటే ఏమిటి, ఓటింగ్ అంటే ఏమిటి, ఎన్నికల విధానం అంటే ఏమిటి అని విద్యార్థులకు వివరించారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులు హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో కరస్పాండెంట్ రామస్వామి, ప్రిన్సిపాల్ సంతోషి జ్యోతి రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుదర్శన్ చారీ, ఇంచార్జి రేణుక, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘాల పోరాట ఫలితమే

- గిరిజన దినోత్సవం నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు
- తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంఘాల విన్నపాలు, పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ గిరిజన దినోత్సవాన్ని ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా అధికారికంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ అన్నారు. ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజన సంఘాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా, మండల కేంద్రాల్లో, గిరిజన పాఠశాలలలో గిరిజన సాంప్రదాయ, సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలకు క్విజ్, వ్యాసరచన వంటి పోటీలో నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. అధికారులు ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. జాతీయ స్థాయిలో కూడా గిరిజన దినోత్సవం నిర్వహణకు నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన కొమ్ము విజయ్ కుమార్

నవతెలంగాణ-సిద్దిపేట



ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ ప్రీతంని బుధవారం హైదరాబాదులో కలిసినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మెన్ కొమ్ము విజయ్ కుమార్ తెలిపారు. నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్లు పుట్ల యేసు, కొత్తూరు నరహరి, చింత కింది శెంకర్, జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్‌లు మర్యాదపూర్వకంగా ప్రీతంను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర చైర్మెన్ సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ అర్బన్ మండల్ చైర్మెన్ బందెల కనకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నవతెలంగాణ-మద్దూరు



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పాసికంటి లక్ష్మమ్మ, రాందాస్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మెన్ పాసి కంటి వెంకటరమణ అన్నారు. మండలంలోని లద్నూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు ట్రస్ట్ సభ్యుడు పాసికంటి హరిప్రసాద్ పంపించిన రూ.25వేలతో బూట్లు అందించారు. అదేవిధంగా పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.5 వేలు నగదు పురస్కారాలను అందజేశారు. మూడో తరగతి నాలుగో తరగతి ఐదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, రేబర్తి పిఏసీఎస్ వైస్ చైర్మెన్ ఇర్రి రాజిరెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ చెక్కులను రిలీజ్ చేయాలి

నవతెలంగాణ-సిద్దిపేట



పెండింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ సంబంధించిన చెక్కులను ప్రభుత్వం వెంటనే రిలీజ్ చేయాలని బహుజన కార్మిక సంఘాల సమాఖ్య సిద్దిపేట జిల్లా కన్వీనర్ శివరాత్రి శ్రీనివాస్ కోరారు. బుధవారం సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పూజల హరికృష్ణకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై కొండంత ఆశతో ఉన్నారన్నారు. ప్రజలకు ఇవ్వాల్సిన చెక్కులను విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బేట ఆనంద్, చెప్యాల భాస్కర్, పాల్గొన్నారు.

వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

నవతెలంగాణ-జగదేవ్‌పూర్



జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు మచ్చ బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్గీకరణ పై సుప్రీం కోర్టు ఇచ్చిన సమాజిక న్యాయ తీర్పును ప్రభుత్వం రాష్ట్రంలో వర్గీకరణ వెంటనే చేయాలని కోరారు. ప్రభుత్వం రాష్ట్రంలో వర్గీకరణ వెంటనే అమలు చేస్తామని సీఎం అసెంబ్లీలో చెప్పారని అన్నారు. కానీ అసెంబ్లీలో ఎటువంటి బిల్లు ఆమోదం చేయకుండానే అసెంబ్లీ సమావేశాలు ముగించారని తెలిపారు. ప్రభుత్వ పని తీరు ప్రకటనలకు మాత్రమే పరిమితం కాకుండా వర్గీకరణ బిల్లు గవర్నర్‌కి పంపి వెంటనే ఆర్డినెన్సు తీసుకవచ్చి రాష్ట్రంలో జరుగుతున్నటు వంటి ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పీజీ అడ్మిషన్లు, గ్రూప్ 1, డీఎస్సీ, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలలో రిజర్వేషన్ అమలు జరిగేలా చూసి మాదిగలకు సామాజిక న్యాయం చేయాలని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం మాదిగలపై ఉన్న చుత్తశుద్ధిని చాటుకోవలని తెలిపారు. ముఖ్య మంత్రి ఇచ్చిన మాట వెంటనే నిలబెట్టుకోవాలని తెలిపారు. ఎస్సీలో ఉన్న ఉపకులాలు గత 30 ఏళ్లుగా నష్టపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైన వెనుకబడిన కులాలకు న్యాయం చేయాలని అన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేత

నవతెలంగాణ-జగదేవ్‌పూర్



పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను జగదేవపూర్ పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితునికి అందజేశారు. జగదేవపూర్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం అంతాయగుడ గ్రామానికి చెందిన బంగారం మహేందర్ గత నెల 29న తన వన్ ప్లస్ సెల్ ఫోనును అంతాయగుడా గ్రామంలో పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు జగదేవ్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది జి.రమేష్ సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో సెల్ ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. పోయిన ఫోను స్వాధీన పరచుకున్న తర్వాత బాధితున్ని జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌కి పిలిపించి సెల్ ఫోన్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫోన్, ఇతర వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

ప్రజల రక్షణ సెల్ఫ్ సెక్యూరిటీ కోసం సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని 24 గంటలు పనిచేస్తాయని, లేని గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మర్కుక్ ఎస్ఐ ఓ.దామోదర్‌లు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ ప్రజలు, వ్యాపారస్తులు ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. గ్రామ ప్రధాన కూడలిలో, ఎగ్జిట్ ఎంట్రీ పాయింట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం చాలా ముఖ్యమన్నారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల పనిచేయడం లేదని, గ్రామంలో ఉన్న యువకులు ఏం చేస్తున్నారు. అనేది తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. యువకులు గంజాయి డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రుల పై ఉంటుందన్నారు. యువకులు ఏదైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నారని తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారిని పిలిచి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన గుడుంబా, నాటు సారాయి, తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామంలో సామరస్య వాతావరణం గురించి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు అధికారులము రుణమాఫీ అయిందని కేవైసీ అప్డేట్ చేయాలని కారణాలతో సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తున్నారని, రుణమాఫీ విషయంలో ఏదైనా సమస్య ఉంటే నేరుగా బ్యాంకు వెళ్లి బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 సైబర్ సెల్ జాతీయ హైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో ఎవరు కూడా బెల్ట్ షాప్ నడపవద్దని , ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే, ఎవరన్నా అనుమానాస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100 కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు డిపార్ట్మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులున్నారు.

పట్టుదల, నైపుణ్యంతో చదివితే బంగారు భవిష్యత్తు

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-దుబ్బాక

విద్యార్థులు పట్టుదలతో చదివి నైపుణ్యాన్ని పెంపొందించుకునేలా కృషి చేయాలని అదే బంగారు భవిష్యత్తుకు మార్గం చూపుతుందని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు ఖ్యాతి పెంచేలా విద్యలో పోటీ తత్వాన్ని అలవర్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల, ఆదర్శ పాఠశాలలను సందర్శించాలన్న సీఎంఓ ఆదేశాల మేరకు తొలిసారిగాసిద్దిపేట జిల్లా దుబ్బాక పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌ను, మండల పరిధిలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాలను ఆయన తన కార్యవర్గ సభ్యులతో కలిసి బుధవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి చదువులో రాణించాలని దిశా నిర్దేశం చేశారు. మోడల్ స్కూల్‌లో మెయిన్ గేట్ నుంచి పాఠశాల వరకు సీసీ రోడ్డు, అదనపు తరగతి గదులు, మురికి కాల్వలు, కిచెన్ షెడ్డు నిర్మాణం, ఇతర పలు సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరుతూ ప్రిన్సిపాల్ సుప్రియ కమిషన్ చైర్మెన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కల్ని నాటి నీరును పోశారు.ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, రేణిగుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, సిద్దిపేట జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ కవిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరామ్ రెడ్డి,ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ అఖిలేష్,డీఈఓ వై.శ్రీనివాస్ రెడ్డి,ఆర్ డీఓ పీ.సదానందం,ఉపాధ్యాయ బృందం, మున్సిపల్ సిబ్బంది,పలువురు పాల్గొన్నారు.

కోదండరామ్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమ కళాకారులు



నవతెలంగాణ-తొగుట

బుధవారం కోదండరామ్‌ను హైదరాబాద్‌లోని తన ఆఫీసులో తెలంగాణ ఉద్యమ కళాకారులు కలిసి తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచిన కళాకారులకు న్యాయం చేయాలని, ఉద్యమ కళాకారులకు అండగా ఉండాలని వినతి పత్రాన్ని తెలంగాణ కళా వేదిక రాష్ట్ర కార్యదర్శిబండకాడి గణేష్ ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎంతో మంది కళాకారులు ఇల్లు, పిల్లలను వదిలి రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. గోసి గొంగడి వేసి పల్లెపల్లెల్లో ప్రజలను చైతన్యం చేసి పోలీసుల లాటిదెబ్బలు, కేసులకు సైతం భయపడకుండా ఉద్యమాన్ని ఉధృతం చేసిన ఉద్యమ కళాకారులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాకారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సాంస్కృతిక సారథి పెట్టి ఎలాంటి నోటిఫికేషన్, ప్రకటన లేకుండా 550 మందికి ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపించారు. అప్పటి సాంస్కృతిక సారథి చైర్మెన్ రసమయి బాలకిషన్ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని వారికి, తనకు నచ్చినవారికి, వారి అనుచరులకు స్వయంగా ఉద్యోగాలు ఇచ్చుకున్నారని మండి పడ్డారు. నిజంగా ఉద్యమంచేసిన ఉద్యమ కళాకారులకు అన్యాయం చేశారని అన్నారు. ఇదేంటని అడిగితే రెండవ లిస్ట్‌లో ఇస్తామని చెప్పారని ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదన్నారు. అప్పటి మంత్రులను ఎన్నిసార్లు కలిసి మా బాధలు మొర పెట్టుకున్నా కనికరం చూపలేదని చెప్పారు. దయ చేసి ఇప్పుడయిన సాంస్కృతిక సారథిలో అర్హత లేని వారిని తొలగించి నిజమైన ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని కోరారు. మాపేద ఉద్యమ కళాకారులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కోదండరామ్ స్పందిస్తూ ఒక వారం రోజుల్లో ప్రభుత్వ పెద్దలతో కలిసి చర్చిస్తామని హామీ ఇచ్చారు. కోదండరాంను కలిసిన వారిలో తెలంగాణ కళా వేదిక రాష్ట్ర సభ్యులు కల్వకుంట్ల స్వామి, చిన్నగుండేల్లి పరమేష్, పెజ్జాపూర్ నరేష్, రాజక్కపేట రమేష్, అందే ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మండల్ కమిషన్ ఆమోదాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలి

- ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మండల్ కమిషన్ అమలు ఆమోదం జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని వెంటనే మండల కమిషన్ ఆమోదాన్ని అమలు చేయాలని నియోజకవర్గం జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మండల్ కమిషన్ అమలుకు ఆమోదం తెలిపిన రోజుగా పాటిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల్ కమిషన్ సిఫార్సులకు1990లో ఆనాటి వీపీ సింగ్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. అయినప్పటికీ 1993 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీలకు రిజర్వేషన్ 27శాతం, 2009నుంచి కేంద్ర విద్యాసంస్థలలో అమలు అయిందన్నారు. మండల్ కమిషన్ సూచించిన 38 సిఫారసులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థలలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ లకు 42శాతం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వడ్డేపల్లి మల్లేశం, టీపీసీసీ ప్రతినిధి కేడం లింగమూర్తి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు మహమ్మద్ హసన్, గొర్ల ఐలేష్ యాదవ్, గుత్తి కొండ వేణు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట మున్సిపాలిటీ సందర్శన

- సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ నారాయణరావు



నవతెలంగాణ-సిద్దిపేట

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం పరిశీలన కొరకై ఉమ్మడి మెదక్ జిల్లాకి ప్రత్యేక అధికారిగా నియామకమైన సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ కె.నారాయణ రావు బుధవారం సిద్దిపేట మున్సిపాలిటీని పరిశీలించారు. ఇంచార్జి కమిషనర్ ప్రేరణ ఆయనకు స్వాగతం పలికారు. పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని స్వచ్ఛ బడిలో పర్యటించారు. అక్కడ తయారవుతున్న సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలించారు. గోశాలలో ఆవు పేడ ద్వారా పిడకలు తయారీ చేసే యంత్రాన్ని పరిశీలించారు. మొక్క ను నాటారు. డిజిటల్ తరగతి గదిలో తడి, పొడి, హానికర చెత్త సేకరణ విధానం, సేంద్రియ ఎరువు తయారి, పట్టణంలో మౌలిక సదుపాయాలను ప్రొజెక్టర్ ద్వారా వీక్షిం చారు. ఇళ్లల్లో మనం నిత్యం వాడుకుని గ్లాసులు, ప్లేట్లు, స్ట్రాలు,స్పూన్ లు వంటివి ప్లాస్టిక్ వాడకుండా స్టీల్ ప్లేట్‌లు, బాటిల్‌లు, గ్లాస్‌లు కనబడేలా ఏర్పాటు చేసిన జీరో వేస్ట్ హెూమ్‌ని పరిశీలించారు. సిద్దిపేట పట్టణంలో స్వచ్ఛ బడి నిర్వహణ అద్భుతంగా ఉందని అధికారులను, వార్డు కౌన్సిలర్లను అభి.నందించారు. స్వచ్ఛ బడి కొరకు అర ఎకరం స్థలం ఇస్తేనే ఇంత అద్భుతంగా నిర్వహణ జరుగుతుందనీ అన్నారు.

బీసీడీ నుంచి బీసీఏ లోకి మార్చాలి

- తహసీల్దార్‌కు వినతి పత్రం



నవతెలంగాణ-నంగునూరు

సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ముదిరాజులను బీసీడీ నుంచి బీసీఏ లోకి మారుస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాలని ముదిరాజు మహాసభ జిల్లా అధ్యక్షులు యామ ధర్మ ముదిరాజు డిమాండ్ చేశారు. ముదిరాజులను బీసీఏ లోకి మార్చాలని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా బుధవారం నంగునూరు మండల తహసీల్దార్ జి.సరిత కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే ముదిరాజులను బీసీఏ లోకి మార్చి న్యాయం చేయాలని కోరారు. ముదిరాజులు చాలా వెనుకబడిన కులంగా మిగిలిపోతున్నారని, రిజర్వేషన్ లేక చదివిన చదువులకు ఉద్యోగాలు రావడం లేదన్నారు. బీసీఏ లోకి ముదిరాజులను మార్చకుంటే పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల అధ్యక్షుడు పిల్లి నారాయణ, నాయకులు గట్టు శ్రీనివాస్, గౌరబోయిన సంపత్, సొప్పరి ఎల్లదాస్, అప్పీసు నర్సింలు, కొండిల్ల రాజు, గౌరబోయిన స్వామి, గాడిచర్ల సంపత్, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు

తిమ్మాపూర్ నుంచి అందె వరకు రోడ్డుకు మరమ్మత్తు చేపట్టాలి

- 10 ఏళ్లు పాలించిన పాలకులు పట్టించుకోలేదని ఆరోపణ
- ఏళ్ల తరబడి ఉన్న సమస్యను పరిష్కరించాలని పొన్నం దృష్టికి
- జాయింట్ యాక్షన్ కమిటీ వినతి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

గత పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం తిమ్మాపూర్ నుండి అందె వరకు ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించలేదని, ఈ రహదారి గుండా నిత్యం12 కిలో మీటర్ల వరకు ప్రయాణించే వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, గాయాలపాలై ఆసుపత్రుల పాలవుతున్నారని, వెంటనే రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మంగళవారం రాష్ట్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ను కోరారు. ఈ మేరకు హుస్నాబాద్‌లో కలిసి తిమ్మాపూర్ నుంచి అందె వరకు అధ్వానంగా మారిన రోడ్డును బాగు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలోని తిమ్మాపూర్ నుంచి అందె వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా చెడిపోయిందని, తద్వారా తిమ్మాపూర్, పద్మనాభునిపల్లి, కొండాపూర్, అందె పాటు పలు గ్రామాల ప్రజలు దుబ్బాకకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి సరిగా లేక ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల్లో లక్షలు ఖర్చు చేసిన ప్రాణాలు దక్కించుకోలేకపోతున్నామని మంత్రికి తమ ఆవేదన వ్యక్తం చేశామన్నారు. ఏళ్లతరబ డిగా అధికారులకు, గత పాలకులకు తమ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

-సమస్యను పరిష్కరిస్తానని మంత్రి పొన్నం హామీ

తిమ్మాపూర్ నుంచి అందె వరకు అధ్వానంగా మారిన రోడ్డు పరిస్థితిని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఆర్అండ్‌బీ జిల్లా అధికారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణ ప్రక్రియకు సంబంధించిన టెండర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెండర్ పూర్తయ్యాక రోడ్డు పనులను ప్రారంభించాలని ఫోన్లో ఆదేశించారు. ఈ సమస్యను తొందరలోనే పరిష్కరిస్తారని జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన మంత్రి పొన్నంకు జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు గన్నెబోయిన సతీష్ గౌడ్, రాములు గౌడ్, రాజు, నవీన్, అమర్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తతోనే సైబర్ నేరాల నియంత్రణ

- రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి



నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులు రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు పట్ల అవగాహన, అప్రమత్తత కలిగి ఉంటేనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి అన్నారు. బుధవారం రాయపోల్ మండలం రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ జాగృకత దివాస్‌లో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు బాలికలు, మహిళలు రక్షణకు చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, తదితర అంశాల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు మహిళలు అపరిచిత వ్యక్తులను నమ్మవద్దన్నారు. మహిళలు, బాలికలు మౌనం వీడండి నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. షీటీమ్ ప్రాముఖ్యత నిర్వహించే విధులు, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టాలు, బాల్య వివాహాలు వాటి పరిణామాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాల గురించి వివరించారన్నారు. సోషల్ మీడియా యొక్క పరిణామాలు, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాల నుంచి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల, పిల్లల రక్షణకు ఉన్న చట్టాల పట్ల అవగాహన కల్పించామన్నారు. గతంలో జరిగిన నేరాల గురించి నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి, భరోసా సెంటర్లో ఫోక్సో కేసులలో 18 ఏళ్ల లోపు ఉన్న బాలికలకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశాం. మహిళలు గృహహింస, వరకట్నం గురించి శారీరకంగా మానసికంగా హింసించే అంశాల గురించి మహిళా సెంటర్లో నిర్వహించే కౌన్సిలింగ్ గురించి వివరించారు. విద్యార్థులు లక్ష్యం, అపరిచిత వ్యక్తులతో ఎలా ప్రవర్తించాలని అంశాల పట్ల వివరించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ గురించి విద్యార్థినిలకు వివరించారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు వేదించిన, అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన, వెంటనే డయల్ 100, సిద్దిపేట షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667434 స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్, 9494639498, మహిళ పోలీస్ స్టేషన్ సిద్దిపేట 8712667435 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. షీటీమ్ యొక్క సేవల గురించి తెలిపిన పాఠశాల విద్యార్థిని అభినందించి చిరు కానుక అందించారు. ఈ కార్యక్రమంలో రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు చేనేత కార్మికులకు అండగా ఉండాలి



నవతెలంగాణ-సిద్దిపేట

జాతీయ చేనేత దినోత్సవము పురస్కరించుకొని ఎంతో నైపుణ్యంతో కూడిన వృత్తి చేనేత వృత్తి అని, దీనిని భావితరాలకు అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని, చేనేత కార్మికులకు అండగా ఉండాలని జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు డాక్టర్ కస్తూరి సతీష్ కోరారు. సిద్దిపేటలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బుధవారం పూలమాలవేసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్ల ద్వారా ఉపాధి కల్పించి, వారు తయారు చేసిన నేత బట్టలను రాష్ట్ర ప్రభుత్వం టెస్కో ద్వారా ఖరీదు చేసి, వెంటనే బిల్లులు చెల్లించి బాసటగా నిలవాలని కోరారు. సిద్దిపేట జిల్లా పద్మశాలి సంఘం ప్రచార కార్యదర్శి ముదిగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న చేనేత వృత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి, నేత కార్మికులకు చేతి నిండా పని కల్పించి, ఆత్మహత్యలు, ఆకలి చావుల బారిన పడకుండా జియో టాక్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల రూ.10వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షులు కామునీ రాజేశం మాట్లాడుతూ చేనేత కార్మికులకు 35 కిలోల అంత్యోదయ కార్డులు మంజూరు చేసి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు జోగు బిక్షపతి, గుండు రవితేజ, కొండబత్తిని కోటి, ఉష, కోయిల గణేష్, దికొండ బాలకిషన్, ముదిగొండ లక్షన్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల పై దాడులను అరికట్టాలి

- డీబీఎఫ్ నేత పి.శంకర్



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో దళితుల(ఎస్సీ, ఎస్టీ) పై నిరంతరం జరుగుతున్న దాడులను అరికట్టాలని, దాడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కివెంకటయ్యకు దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్)జాతీయ కార్యదర్శి పి.శంకర్ విన్నవించారు. బుధవారం జిల్లాలో పర్యటించిన కమిషన్ చైర్మెన్ కు శంకర్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకర్లతో పి.శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రోజు ఎదో చోట దళితుల పై దాడులు నిత్యకృత్యంగా కొనసాగుతున్నాయన్నారు. చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు ఐన ఏడు రోజులలో బాధితులకు అందాల్సిన తక్షణ సహాయం అందించడం లేదని, చార్జిషీటు వేసిన తర్వాత పూర్తిగా చెల్లించాల్సిన నష్టపరిహారం కోసం కేసు పూర్తి ఐన అందించకుండ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. సీఎం అధ్యక్షత ఏర్పాటు చేయాల్సిన హైపవర్ కమిటిని ఏర్పాటు చేసి, ప్రతి ఆరు నెలలకొసారి సమీక్ష చెసి దళితుల పై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటిని ఏర్పాటు చేయాలని, కమిటీలో ఎస్సీ సంఘాల నాయకులకు అవకాశం కల్పించాలన్నారు. 41 సీఆర్పీ పేరుతో నిందితులకు స్టేషను బెయిల్ ఇవ్వడాన్ని నిలిపివేసి ఎస్సీ ఎస్టీల ప్రత్యేక రక్షణ చట్టం స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రతి జిల్లాకు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. దళితుల పై దాడులు జరిగె ప్రాంతాలను(ప్రొన్ ఎరియా) ప్రకటించి నివారణ చర్యలు చెపట్టాలన్నారు. సంక్షెమ హస్టళ్ళ లో కనీస సదుపాయాలు కల్పించాలని, పెండింగ్ కాస్మొటిక్ చార్జీలను చెల్లించాలని, డ్రెస్‌లు, నొట్ బుక్ లు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొమరవెళ్ళి మండలం పొసాన్ పల్లి గ్రామానికి చెందిన బాధితుడు సతీష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలో బదిలీ సహజం



నవతెలంగాణ -నంగునూరు

ఉపాధ్యాయ వృత్తిలో బదిలీలు సహజమేనని విద్యార్థుల మనసులను చూరగొన్న ఉపాధ్యాయులను విద్యార్థులు ఎన్నటికీ మర్చిపోరని నంగునూరు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు జి. రామస్వామి పేర్కొన్నారు. నంగునూరు మండలం గట్లమల్యాల ప్రాథమిక పాఠశాలలో గత 12 ఏళ్లుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి గత నెలలో జరిగిన బదిలీలలో ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులు మహేందర్ రెడ్డి, వెంకటలక్ష్మి కృష్ణవేణిలకు ఆత్మీయ వేడుకోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు గట్లమల్యాలలో పనిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరారెడ్డి, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేశ్ ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ రాణి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సీఆర్పీలు గ్రామ యువకులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లన్నసాగర్ పంపుహౌస్ నుంచి నీటి పంపింగ్ ప్రారంభం



నవతెలంగాణ-తొగుట

రైతన్నలకు వానాకాలం పంటలకు అవసరమైన సాగునీటిని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నీటిని విడుదలను ప్రారంభిస్తుందని మల్లన్నసాగర్ డీఈ చెన్నూ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం వర్షా కాలంలో రైతులు సాగు చేసిన పంటలకు నీరు అందించేందుకు ప్రభుత్వం మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్ ప్రారంభించడానికి ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. 2024-25 ఏడాదికి పంపింగ్ సీజన్‌లో మొదటి విడతలో గురువారం నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈసారి పంపింగ్‌లో ప్రస్తుతం ఆమోదించబడిన షెడ్యూల్ ప్రకారం 8 తేదీ నుంచి 11 వరకు 4 పంపులను నడుపడానికి అనుమతులు వచ్చాయని తెలిపారు. మొత్తం 5 వేల క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తామని, రిజర్వాయర్‌లోకి రోజుకు 0.432 టీఎంసీల (శతకోటి ఘనపుటడుగులు) చొప్పున నీటిని లిఫ్టింగ్ చేస్తామని అన్నారు.

ఆన్లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్



నవతెలంగాణ-కొమురవెల్లి

ఆన్లైన్లో సైబర్ నేరగాళ్ల చేసే మోసాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్ తెలిపారు. బుధవారం మండలంలోని గౌరయపల్లిలో జాగరత్ దివాస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరగాళ్ల చేసే మోసాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలలో ఓ ఎల్ఎక్స్ యాప్, వీడియో కాల్ చేస్తూ, ఓటీపీల ద్వారా, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ, బహుమతులు గెల్చుకున్నారని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే స్పందించకూడదని తెలిపారు. ఒకవేళ ఎలాంటి మోసాలకైనా ప్రజలు గురైనట్లయితే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు

పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలి

- ఎంపీడీవో గణేష్ రెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని ఎంపీడీవో గణేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం లింగుపల్లి, లక్ష్మీ నగర్ గ్రామాల్లో పారిశుద్ధ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలని సూచించారు. మహిళలు వారి ఇళ్ల చుట్టూ ఉన్న చెత్తాచెదారం ను గ్రామపంచాయతీ వాహనంలోనే వేయాలని సూచించారు. గ్రామంలోని మురికి కాలువల్లో నీరు నిలవకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే వాటిలో లార్వ దశలో మొదలైన దోమలు ఎక్కువ ప్రజలను అనారోగ్య బారిన పడవేస్తాయని అన్నారు. వేరు వేరు చేసి గ్రామపంచాయతీ నుంచి వచ్చే ట్రాక్టర్లో చెత్తను వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉషారాణి, షాహిని బేగం, పహీం తదితరులు పాల్గొన్నారు.

మొక్కల్ని నాటి సంరక్షించాలి

- చైర్ పర్సన్ వనిత



నవతెలంగాణ- దుబ్బాక

మున్సిపల్ ప్రజలు విరివిగా మొక్కల్ని నాటి వాటికి నీటిని పోస్తూ సంరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి కోరారు. ప్రతి ఇంటి ముందర పూలు, పండ్లు, ఔషధ మొక్కల్ని పెంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం 'జాతీయ చేనేత దినోత్సవాన్ని' పురస్కరించుకొని దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 'పద్మశాలి స్మశాన వాటిక'లో ఆ సంఘం అధ్యక్షుడు గాజుల తిరుపతి, కార్యవర్గ సభ్యులతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ వనితా భూమిరెడ్డి మొక్కల్ని నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో చైర్ పర్సన్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పుట్ట శంకర్, అంకం దుబ్బయ్య, పలువురు పాల్గొన్నారు.

రామరాజుకు ఘనంగా సన్మానం



నవ తెలంగాణ -గజ్వేల్

వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి బుధవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో లక్ష్మీ ప్రసన్న చారిటేబుల్ సంస్థ ఉత్తమ సేవా పురస్కారాలను ప్రధానం చేశారు. గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు గత 25ఏళ్ల నుంచి చేస్తున్నటువంటి ఆధ్యాత్మిక, సామాజిక సేవలను గుర్తించి సేవారత్న పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు. ఇంటర్ నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాజీ రాజ్యసభ సభ్యులు రాపోల్ ఆనంద భాస్కర్, ప్రజా ఉద్యమ గాయకుడు ఏపూరి సోమన్న సంస్థ నిర్వాహకులు లక్ష్మీ ప్రసన్న, సామ శ్రీధర్, పంజాల వెంకటేష్ గౌడ్, సామ ప్రశాంతి, వంగపల్లి అంజయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో పుస్తె, మట్టెల అందజేత



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో సిరిపురం సరిత, శివకుమార్ దంపతుల ఆర్థిక సహాయంతో దుద్దెడ గ్రామానికి మాధవి వివాహానికి పుస్తె, మట్టెలు, చీర, గాజులు అందించినట్లు రీజియన్ చైర్మెన్ మాంకాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సహాయం చేయడంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు వాణి ముందు ఉన్నారనీ అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు మర్యాల వాణి, సరిత, శివకుమార్, వీరేశం, ప్రకాష్ పాల్గొన్నారు.

పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీడీఓ



నవతెలంగాణ -నంగునూరు

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ గ్రామాన్ని అధికారుల బృందం బుధవారం సందర్శించారు. ఎంపీడీఓ బి.లక్ష్మప్ప అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల చేతుల శుభ్రతను పరిశీలించారు. శుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించి, ఎలాంటి జబ్బులు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. వంటగదిని శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచించారు. ప్రాథమికోన్నత పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ బి. లక్ష్మప్ప మాట్లాడుతూ పాఠశాలలో మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలని కోరారు. మురుగుకాల్వలు పూడిక తీసి, వీధుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, వర్షపు నీటిని డ్రైనేజీల్లోకి మళ్లించాలని పంచాయతీ సిబ్బందికి చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామ ప్రత్యేక అధికారి ప్రభాకర్ రావు, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ హర్షద్, హెచ్.ఎం అంగన్వాడీ టీచర్ లక్ష్మి, ఏఎన్ఎం స్వర్ణలత, ఆశా వర్కర్ లలిత, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సీఎం ఫోటో పెట్టాలి

- కాంగ్రెస్ నాయకులు గాధగోని చక్రధర్ గౌడ్



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనమిది (8) నెలలు గడుస్తున్నా, సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి ముఖ్యమంత్రి ఫోటో పెట్టాలేదు. నిబంధనల ప్రకారం సీఎం ఫోటో పెట్టాలని కాంగ్రెస్ నాయకులు గాధగోని చక్రధర్ గౌడ్ కలెక్టర్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఫోటో కాకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఫోటో ఉండటం, ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పైన విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మాజీ ముఖ్యమంత్రి ఫోటో ఉండటం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ముఖ్యమంత్రి చిత్రపటం లేకపోవడం మమల్ని చాలా కలిచి వేసిందని అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో చాలా ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి చిత్రపటం ఏర్పాటు చేయలేదని, సిద్దిపేట ఆర్డీవో కార్యాలయంలో సీఎం ఫోటో లేదని అన్నారు. అధికారులు ఈ అంశంపై స్పందించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం బాధితులకు న్యాయమందించాలి

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం బాధితులకు న్యాయమందించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెంబక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్, సభ్యులు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ఇతర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు వాటిలో లబ్ది చేకూర్చిన కేసుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, ఎస్సీ ఎస్టీ హాస్టల్ల గురించి జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి, కమిషనర్ ఆఫ్ పోలీస్ డా.అనురాధలు కమిషన్‌కు వివరించారు. ఈ సమావేశంలో కమిషన్ చైర్మెన్ మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం సమకూర్చేలా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనప్పుడు పోలీస్ శాఖ, ఇతర అధికారులు వేగంగా స్పందించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం బాధితులకు న్యాయం అందించాలని ఎస్సీ, ఎస్టీలపై దాడులను చేయడానికి భయపడేలా పోలీస్ శాఖ వ్యవహరించాలని అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో, పోలీస్ శాఖలో పెండింగ్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అన్నారు. కొత్తగా వచ్చిన 41 సీఆర్పీ చట్టం వలన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు విచారణకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరేందుకు త్వరలోనే ఢిల్లీ వెళ్లి కేంద్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలుస్తామని తెలిపారు. మారుమూల ప్రాంతాల నుంచి విద్య కోసం వచ్చే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా ఎస్సీ, ఎస్టీ హాస్టల్లో, గురుకులాల్లో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. విద్యార్థులకు అందించని హాస్టల్లో నోట్ బుక్స్, టెస్ట్ బుక్స్, యూనిఫార్మ్, కాస్మోటిక్ చార్జీలను త్వరగా అందించాలని, సొంత భవనాలు లేని హాస్టల్లకు సొంత భవనాలు నిర్మించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, సిద్దిపేట జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని, హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన బంజారా భవన్ వెళ్లడానికి రహదారిని ఏర్పాటు చేసి వాడకలోకి తీసుకువచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని అన్నారు. నూతనంగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని, ఆశ వర్కర్లను నియమించాలని, ప్రతి నెల చివరి రోజు సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజలకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్, ఎస్టీ అభివృద్ధి శాఖ ద్వారా అందించే స్వయం ఉపాధి యూనిట్లను పెండింగ్లో ఉంచకుండా లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా చాలా చైతన్యవంతమైనదని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ముందు నిలిచిందని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలు చేసి ఏస్సీ, ఎస్టీలపై దాడులను నివారించడంలో రాష్ట్ర స్థాయిలోనే జిల్లా మొదటి స్థానంలో నిలవాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, కమిషనర్ ఆఫ్ పోలీస్‌లు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరగకుండా కఠినంగా వ్యవహరిస్తామని అదేవిధంగా దాడులు జరిగినప్పుడు దాడి చేసిన వారికి త్వరగా శిక్ష పడి బాధితులకు పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సూచించిన అన్ని అంశాలపై చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు రేణిగుంట్ల ప్రవీణ్ కుమార్, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కవిత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సీతారాం రెడ్డి, సిద్దిపేట గజ్వేల్, హుస్నాబాద్ ఏసీపీలు , జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు శంకర్, రాజు, భీమసేనా, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన తొర్నాల వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

- ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల రైతులు మెళకువలు పాటించాలి
- వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం తొర్నాల శాస్త్రవేత్తల బృందం



నవతెలంగాణ-తొగుట

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతాల్లో పొలం నుంచి మురుగు నీటిని తీసివేయాలని ప్రధాన శాస్త్రవేత్త ఎస్ శ్రీదేవి సూచించారు. బుధవారం వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం తొర్నాల శాస్త్రవేత్తల బృందం డా.ఎస్. శ్రీదేవి, డా. ఉమారాణి, డా.రమాదేవి, డా. పల్లవి శాస్త్రవేత్తలు గుడికందుల గ్రామంలో వరి, ప్రత్తి, మొక్కజొన్న పంట లను పరిశీలించారు.

వరి:- నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రా. కార్బో ఫ్యూరాన్ 3సీజీ గుళికలను ఇసుకలో కలిపి చల్లి నట్లయితే ప్రధాన పొలంలో పంటను 15-20 రోజుల వరకు కొన్ని రకాల పురుగుల నుంచి కాపాడు కోవలని తెలిపారు. ఇప్పటివరకు నార్లు పోయని రైతాంగం, వర్షాలను సద్వినియోగము చేసుకొని పొలాలను దమ్ము చేసి వరి పంటను నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవడము వలన పెట్టుబడి ఆదా చేసుకోవాలని చెప్పారు. నాటు పెట్టిన తర్వాత ప్రతి 2 మీటర్లకు కాలిబాటను తీయటం వలన గాలి వెలుతురూ బాగా ప్రసరించడంతో బాటు సుడిదోమ ఉధృతిని నివారణ చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుందని అన్నారు. ముందస్తు చర్య నివారణ భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3 సీజీ గుళికలను నాటిన 10 నుంచి 15 రోజుల మధ్య వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లి కోడు తెగుళ్ల నుంచి పంటను కాపాడు కోవలన్నారు.

ప్రత్తి:- ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ రసాయనిక ఎరువులను పై పాటుగా 20 రోజుల నుంచి 40 రోజుల వయ సున్న పంటకు మొక్కల మొదళ్ళల్లో వేయాలని తెలిపారు. 7-10 సెం. మీ దూరంలో పాదులుతీసి రసాయనిక ఎరువులను వేసి మట్టితో కప్పాలన్నారు. ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 మందు లేక 13-0-45మందు లేక 10 గ్రా. యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించుటకు 3 గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ లేక 2 గ్రా. కార్బెండజిమ్, మ్యాంకోజెబ్ శిలీంద్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్టు వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయలన్నారు. ప్రత్తి పంటలో వచ్చే గడ్డి జాతి వెడల్పాకు కలుపు మొక్కలను నివారించడానికి (2 నుంచి 3 ఆకుల దశలో ఉన్న కలుపు మొక్కలు) 2 మి.లీ. క్విజలోఫాప్ ఇథైల్ ం 1.25 మి.లీ. పైరిథాయోబ్యాక్ సోడియం కలుపు మందులను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపారు. పత్తిలో పచ్చ దోమ నివారణకు ఇమిడా క్లోప్రేడ్ 0.3 గ్రా, లీ లేక థైయోమెథాక్సమ్ 0.25 గ్రా, లీ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని చెప్పారు.

మొక్కజొన్న: - మొక్కజొన్న శాకీయ దశలో ఎక్కు వ నీటిని తట్టుకోలేదు కాబట్టి పొలం నుంచి నీటిని వెంటనే తీసివేయాలని, అధిక వర్షాల వలన నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్ని ఊదా రంగులోకి మారే అవకాశం ఉంటుందని పేర్కొన్నా రు. కావున వర్షాలు నిలిచిన తర్వాత 5 గ్రా. 19-19-19మందు లేక 20 గ్రా డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలని అన్నారు. మోకాలు ఎత్తుదశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం, 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవాలని అన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువ ఉన్నట్లయితే నివారణకు, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా/ లీ లేదా క్లోరాంట్రానీలిప్రోల్ 0.3 మీ.లి/ లీ పిచికారి చేసు కోవాల తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత వర్షాధార పంటకు పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా, 15 కిలోల పోటాష్ ను వేసుకోవాలని తెలిపారు.

కూరగాయలు:-టమాట, వంగ, మిరప పంటల కుళ్ళు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలని అన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు కూరగాయల పంటలలో ఆకుమచ్చ తెగులు సోకుటకు అనుకూలంగా ఉందని తెగులు నివారణకు 1 గ్రా. కార్బెండజిమ్ లేక 1 మి.లీ. ప్రోపికోనజోల్ మందును లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని చెప్పారు. వారితో పాటు మండల వ్యవసాయ అధికారి మోహన్, విస్తరణ అధికారులు దేవేందర్, జమీల్ వివిధ గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి దళితుల సమస్యలు



నవతెలంగాణ-అక్కన్నపేట

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కివెంకటయ్య, కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ పాల్గొన్న సమావేశంలో దళితుల సమస్యలపై దళిత సంఘాల నాయకుడు కుమారస్వామి బుధవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో దళిత జర్నలిస్టులకు దళిత బంధు పథకం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు దళిత బంధు పథకాన్ని మంజూరు చేసి ఆన్ లైన్‌లో లబ్ధిదారుడి వివరాలతో కూడిన సమాచారాన్ని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు పూర్తి చేశారని, అంతేకాకుండా కలెక్టరేట్ కార్యాలయంలోని బ్యాంకులో వ్యక్తిగత ఖాతాలను సైతం తెరిచారని, కుమారస్వామి సభ దృష్టికి తెచ్చారు. ఆ సమయంలో ఎన్నికల నియమావళి ఉన్నందున తర్వాత దళిత బంధు అమలు చేస్తామని అధికారులు చెప్పారన్నారు. ప్రభుత్వాలు మారడంతో దళిత బంధు పథకం అమలు ప్రక్రియ నిలిచిపోవడంతో దళిత జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దళిత జర్నలిస్టుల సమస్య దళిత బంధును అమలు చేసే విధంగా ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి దళితులను ఆర్థికంగా ఆదుకునేందుకు దళిత బంధు పథకాన్ని అమలు చేసే విధంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రభుత్వానికి నివేదించి దళితుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు అధికారులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఫిట్మెంట్ ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి


- పెండింగ్ కరువు భత్యం డిఏలు చెల్లించాలి
- పీఆర్టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ




నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

పీఆర్సీ ఫిట్మెంట్ 50 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు ఆదరాసుపల్లి శశిధర్ శర్మ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని పలు పాఠశాలలో సభ్యత నమోదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వచ్చే మాసంలో డీఎస్సీ అపాయింట్మెంట్స్ కన్న ముందే జిల్లాలో రేషనైజేషన్ చేయాలని జిల్లా శాఖ పక్షాన కోరారు. జీవో నెంబర్ 11, 12 సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్ఎం పోస్టు కల్పించాలని, పదివేల పీఎస్ హెచ్ఎం పోస్టులు ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. అంతే కాకుండా ఫిట్మెంట్ 50శాతం పిఆర్సి ఇవ్వాలి. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్స్ వెంటనే క్లియర్ చేయాలని, ఇప్పటికి పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు పంజా రాజమల్లు, ప్రధాన కార్యదర్శి ప్రతాప రాజయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కొలువురు తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు రెమెడీ లింగారెడ్డి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


తల్లిపాలతోనే శరీర పుష్టి, మనోవికాసం వృద్ధి





నవతెలంగాణ- సిద్దిపేటరూరల్

తల్లి పాలలో పిల్లలకు ఆరోగ్యానికి కల్గే మేలులు ఎక్కువగా లభిస్తాయని అంగన్వాడీ సూపర్వైజర్ స్వప్న అన్నారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల భాగంగా బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇర్కోడు అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవజాత శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పాండురంగా చారి, డాక్టర్ శ్వేత, రిలయన్స్ డిస్టిక్ కోఆర్డినేటర్ సంధ్య, అంగన్వాడీ టీచర్లు కనక లక్ష్మి, అరుణ, ఏఎన్ఎం సుజాత, సంతోషి, ఆశ వర్కర్లు రజిత, ఇతర మహిళలు, తదితరు పాల్గొన్నారు.



నవతెలంగాణ-తొగుట

పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు ఇవ్వాలని డాక్టర్ సుభాషిణి తెలిపారు. బుధవారం మండలం లోని వెంకట్రావు పేట అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే, లేదా గంటలోపు ముర్రు పాలు పట్టించటం ప్రారంభించాలని సూచించారు. బిడ్డ జన్మిం చిన నుండి ఆరు నెలల వరకు తల్లిపాలను క్రమం తప్పకుండా అందించాలన్నారు. ఆరు నెలల తర్వాత ఘన పదార్థాలను అందించాలని చెప్పారు. తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరిగి బిడ్డ ఎదుగుదలకు ఎంతో తోడ్పాటు లభిస్తుందని అన్నారు. ఈ కార్య క్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్, ఏఎన్ఎం లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ రాములు, అంగన్వాడీ టీచర్లు జ్యోతి, వీణా, స్వప్న, ఆశా కార్యకర్తలు వినోద, యాదమ్మ, భాగ్యలక్ష్మి, గర్భవతులు, పిల్లలు, బాలంతలు పాల్గొన్నారు

నవతెలంగాణ-దుబ్బాక

అప్పుడే పుట్టిన పిల్లలకు పుట్టిన అరగంట నుంచే తల్లి పాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని తద్వారా చిన్నారుల్లో శరీర పుష్టి కలిగి మనోవికాసం వృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం 12వ వార్డులో తల్లిపాల వల్ల చిన్నారులకు కలిగే లాభాలను పట్ల బాలింతలు,గర్భిణీలకు అవగాహన కల్పించారు. అనంతరం సాంప్రదాయ పద్ధతిలో గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో తల్లులు తమ పాత్ర వహించాలని, చిన్నారులకు తప్పనిసరిగా తల్లిపాలను పట్టించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, 13వ వార్డు కౌన్సిలర్ ఆస సులోచన, దుబ్బాక సెక్టర్ సూపర్వైజర్ చంద్రకళ, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ శ్యాంసన్, అంగన్వాడీ టీచర్లు శిరీష, సుజాత, రేణుక దీనమ్మ, ఆశా పోచవ్వ పలువురు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- సీడీఎంఏ జేడీ కే.నారాయణ రావు



నవతెలంగాణ-దుబ్బాక

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనసాగిస్తున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుందని ఉమ్మడి మెదక్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, సీడీఎంఏ జేడీ కే.నారాయణ రావు కితాబిచ్చారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని పలు రోడ్లపై ఉన్న గుంతలను కంకర సిమెంట్ తో పూడ్చి వేశారు. పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డ్‌లో మాడల్ స్కూల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి 10వ,11వ వార్డుల కౌన్సిలర్లు బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్ తో కలిసి ఆయన మొక్కల్ని నాటారు. మున్సి పల్ లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసా గు తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ కళ్యాణం రమేష్ కుమార్, ఏఈ పృథ్వీరాజ్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సుప్రియ, ఉపాధ్యాయ బృందం, మున్సిపల్ వార్డు ఆఫీసర్లు పీ.నగేష్, మధుసూదన్ రావు, మెప్మా ఆర్పీలు సునీత, శ్యామల, ఆశాలు పాల్గొ న్నారు.

చింతమడక ఆలయ స్వాగత కమాన్ ప్రారంభోత్సవం

- తండ్రి రంగారావు జ్ఞాపకార్థంగా దేవాలయ ముఖ ద్వారం
- బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర ఇన్చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు
- పాల్గొన్న బాలకిషన్ రావు, తేజేశ్వర్ రావు



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్

బుధవారం మండల పరిధిలోని చింతమడక లక్ష్మీదేవిపల్లి స్టేజి వద్ద నిర్మించిన పట్టాభి సీతారామ చంద్ర స్వామి దేవాలయ స్వాగత కమన్ బాలకృష్ణ రావు, తేజేశ్వర్ రావు (కన్నారావు) తో కలిసి బీఆర్ఎస్ పార్టీ మహారాష్ట్ర ఇన్చార్జి కల్వకుంట వంశీధర్ రావు ప్రారంభించారు. ఆలయ ముఖద్వారం ప్రారంభించడం చాలా సంతోషకరంగా ఉందని వంశీధర్ రావు అన్నారు. ముందుగా సీతారాముడి విగ్రహాలను ఊరేగింపు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన దివ్యాంగునికి త్రీ మోటార్ సైకిల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆలోచనల మేరకు తండ్రి కల్వకుంట్ల రంగారావు జ్ఞాపకార్థంగా కేఆర్ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఆలయ కమాన్ నిర్మించామనిఅన్నారు. దీని నిర్మాణానికి అండగా నిలిచిన ప్రజా ప్రతినిధులకు గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామ ప్రజలకు ఏ సమస్య వచ్చిన తమ కుటుంబం సభ్యులు అన్నివేళలా ముందుంటారని అన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, హంసకేతన్ రెడ్డి, భాగ్యలక్ష్మి బాలయ్య, ఎల్లవ్వ మాజీ ఎంపీటీసీ జ్యోతి రాందేవ్, మాజీ ఉపసర్పంచ్ మోత్కు రవి, నాయకులు నాగరాజు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మర్కుక్ ఎస్ఐని కలసిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ నూతన ఎస్ఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఓ.దామోదర్‌ను బుధవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బబ్బూరి మల్లేశం గౌడ్, కాంగ్రెస్ పార్టీ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య, మండల ఉపాధ్యక్షులు ర్యాకం యాదగిరి, నాయకులు కొండల్ రెడ్డి, తదితరులున్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-గజ్వేల్

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ప్రత్యేక అధికారి భారతి హోల్కేరి అన్నారు. బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో దోమల నివారణకు నిర్వహిస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఫీవర్ సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో రాజీవ్ పార్కు వద్ద ఇంటింటికి తిరిగి ఫీవర్ సర్వేను పరిశీలించిన ఆమె యాంటీ లార్వా స్ప్రే ప్రాంతాలను పరిశీలించి దోమల నివారణకై తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం రాజీవ్ పార్కులో చెట్లు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్ గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి. శ్రీనివాస్ కుమార్, సురేందర్ రెడ్డి. ఆశాజ్యోతి, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, ఫీల్డ్ వర్కర్ రమేష్, ఆశా వర్కర్లు బి.స్వప్న రేణుక నవనీత, జ్యోతి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలి
- 'నవతెలంగాణ'తో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

నవతెలంగాణ-నార్సింగి

మెదక్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీరామ్ బుధవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై ఆయన నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్వచ్ఛదనం పచ్చదనంలో ముఖ్యంగా దోమలు పెరగకుండా చర్యలు చేపట్టాలని శ్రీరామ్ సూచించారు. తద్వారా డెంగ్యూ మలేరియా తదితర వ్యాధులను నివారించ వచ్చన్నారు. డెంగ్యూ వైరస్ వ్యాప్తి చేసే టైగర్ దోమ మంచి నీటిలో వృద్ధి చెందుతుందని, దోమవృద్ధి కోసం 2 మిలి లీటర్ల నీరు చాలని, వర్షాలు కురుస్తున్నందున పరిసరాలలో పాత టైర్లలో, కొబ్బరి చిప్పలలో, డబ్బాలలో నిలువ ఉండే నీరు టైగర్ దోమ వృద్ధికి అనువైందని, అందుకే వాటిని తొలగించాలన్నారు. డెంగ్యూ దోమలు పగటి పూట కుడతాయని, దోమ కాటుకు గురి కాకుండా ఫుల్ హాండ్ చొక్కాలు, కాళ్ళకు తగిన జోళ్ళు తొడగాలని సూచించారు. ముఖ్యంగా దోమల నివారణకు పంచాయితీ రాజ్ శాఖ, డీఆర్డీఏ, ఐసీడీఎస్, నాయకులు, గ్రామ ప్రజలు పరస్పర సహకారంతో సామాజిక భాధ్యతగా తీసుకుని మూకుమ్మడిగా కృషి చేయాలని, గ్రామంలో నీరు నిలువ ఉంటే తొలగించాలని, నీరు నిలువ ఉన్న గుంతల లో, మురుగు కాలువలలో, డెంగ్యూ మలేరియా దోమలు ప్రబలే అవకాశాలు ఉన్న చోట్లలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ పౌడర్, కిమోకాన్ పిచికారి చేయాలన్నారు. ఒక వేళ పాజిటివ్ కేసులు వచ్చినట్లయితే వెంటనే న్యూరోస్, మలాటిన్ పిచికారి, ఫాగింగ్ చేయించాలని, పంచాయితీ రాజ్ శాఖ వైద్య ఆరోగ్య శాఖ సంయుక్తంగా, సామాజిక భాధ్యత కలిగిన మీడియా, నాయకులు, ఉద్యోగులు పరస్పర సహకారంతో ప్రజలను పరిసరాల పరిశుభ్రతపై చైతన్యవంతం చేయాలని కోరారు. ఫీవర్ సర్వేలు చేపడుతున్నామని, ఫీవర్ సర్వేలో భాగంగా ఏఎన్ఎంలకు టాబ్‌లు ఇచ్చామని, అందులో నూతన పరిజ్ఞానమైన ఇంటిగ్రేటెడ్ హెల్త్ డిసీజ్ ఇఫార్మేషన్ ప్లాట్ ఫారంలో ఆశాలు ఎక్కడ ఎన్ని కేసులు ఉన్నాయన్న వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. దానివల్ల టాబ్‌లో జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో వీక్షించి ఏ రోజు ఎన్ని కేసులు నమోదు అవుతున్నాయన్న విషయాన్ని బట్టి అవసరం ఉన్న చోట మెడికల్ క్యాంప్ నిర్వహించడానికి వీలు కలుగుతుందని తెలిపారు. జూన్ నెలలో 430 క్యాంపులు నిర్వహించి 16 వేల మందిని పరీక్షించడం జరిగిందని, 550 మందికి టెస్టులు చేశామని, అందులో ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదని తెలిపారు. జులై నెల నుంచి ఇప్పటి వరకు 420 క్యాంపులు నిర్వహించి 20 వేల మందిని



పరీక్షించామని, 8 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని వివరించారు. కేసులు నమోదు అయిన గ్రామాలలో మయారీస్ పిచికారి చేయడం, ఫ్రైడే డ్రై డే నిర్వహించి పరిసరాలను పరిశుభ్ర పరిచి, ప్రజలను చైతన్యవంతం చేసి అదుపు చేశామని పేర్కొన్నారు. టైఫాయిడ్ ముఖ్యంగా కలుషిత నీరు త్రాగడం వల్ల వస్తుందని, కాచి చల్లార్చి వడబోసిన నీటినే తాగాలని అన్నారు. ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలని, ఈగల వల్ల గ్యాస్ట్రెంటటిస్, కలరా, కామర్లు వస్తాయని, బయటి ఆహారం కాకుండా, ఇంట్లో వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా గురువారం జరగబోయే మెడికల్ క్యాంప్‌లో పాల్గొని, పరీక్షలు చేయించుకోవాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు.

అంగన్వాడీ పిల్లలకు పలకల పంపిణీ



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం 20 మంది విద్యార్థులకు పలకలు, బిస్కెట్స్‌లను పంపిణీ చేశారు. సెకండ్ వైస్ ప్రెసిడెంట్ ఆకుల సంజీవ్ సహకారంతో ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బుర్కానాగరాజు, ఫాస్ట్ ప్రెసిడెంట్ వరిగంటి నాగరాజ్, వంటరి రామ్ రెడ్డి, సూర్య ప్రకాష్, నాగేశ్వరయ్య, రావుల రమేష్, అంగన్వాడి టీచర్ ఉమాదేవి, పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీని కలిసిన ఎంపీ రఘునందన్ రావు

నవతెలంగాణ-తూప్రాన్

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు బుధవారం పార్లమెంటులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీని నూలు పోగుల దండతో సత్కరించి మెదక్ ఎంపీ రఘునందన్ రావు మెదక్ పార్లమెంట్ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు అడిగిన పలు అభివృద్ధి పనులపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-చేగుంట

మండలంలోని మక్క రాజుపేట గ్రామ నివాసి జింక శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యం తో మరణించాడు. 2003-04 ఏడాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన ఆయన స్నేహితులు ఈ విషయం తెలుసుకొని బుధవా రం వారి కుటుంబాన్ని పరామర్శించారు. మిత్రుడి ఆత్మ శాంతించాలని మౌనం పాటించారు. అనంతరం వారి కుటుంబానికి చేదోడు వాదోడుగా రూ.35 వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో పీఈటీ ఉపాధ్యాయురాలు మంజులత, స్నేహితులు కుమ్మరి నర్సింలు, పంబాల రవీందర్, నిరుడి భాస్కర్, కర్నే రవి, అంబటి శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, మహమ్మద్ షాదుల్లా, రాజేంద్ర, రంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

29 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-తూప్రాన్

అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రేషన్ బియ్యం లారీలను పట్టుకొని సీజ్ చేసినట్లు తూప్రాన్ ఎస్సై శివానంద్ తెలిపారు. తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో బాగంగా సిజి 08 ఎడబ్ల్యు 5236 రబ్బరు గల లారీని ఆపి చెక్ చేయగా అందులో 620 ప్లాస్టిక్ సంచులలో నింపి ఉన్న 29 టన్నులు,రూ 32,57,120 విలువ గల రేషన్ బియ్యం ఉన్నాయని గుర్తించి, డ్రైవర్ ను పట్టుకొని విచారించగా హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నామని పోలీసులకు డ్రైవర్ తెలిపాడు. అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీలను పట్టుకొని సీజ్ చేసి,డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లుగా తూప్రాన్ ఎస్సై శివానంద్ తెలిపారు.

ముగ్గురు దొంగల రిమాండ్

నవతెలంగాణ - తూప్రాన్ : తూప్రాన్ 44వ జాతీయ రహదారిపై ఉన్న వినోద్ దాబా వద్ద బస్సులో గత జూన్ నెల 9వ తేదీన బస్సులో ప్రయాణిస్తున్న అమీన్ అబ్దుల్ లాలానికి చెందిన రూ.5 లక్షలు దొంగిలించిన ముగ్గురు నిందితులను పట్టుకొని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ తెలిపారు. గత జూన్ నెల 9వ తేదీన అమీన్ అబ్దుల్ లాలాని మసాలా వ్యాపారం చేస్తున్నాడన్నారు. ఇందులో బాగంగా నిజామాబాద్‌కు చెందిన ఇమ్రాన్ నుంచి కలెక్షన్ వసూలు చేసుకోవడానికి గత నెల 9వ తేదిన మధ్యాహ్నం సుమారు 2 గంటల కు కొంపల్లి నుంచి నిజామాబాద్ కి బస్సులో వెళ్లి, ఇమ్రాన్ వద్ద రూ 5 లక్షల నగదు తీసుకొని అతని కాలేజ్ బ్యాగులో పెట్టుకొని తిరిగి నిజామాబాదు నుంచి రాజధాని ఎక్స్ ప్రెస్‌లో హైదరాబాద్‌కు తిరిగి ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో తూప్రాన్ పట్టణ శివారు లోని 44వ జాతీయ రహదారిపై ఉన్న వినోద్ దాబా వద్ద బస్సు ఆగిందన్నారు. ఆ సమయంలో రూ 5 లక్షలు ఉన్న బ్యాగును దొంగిలించిన సూరజ్ పండిత్, సంతోష్ సాయజ్ రావు, సునీల్ అర్జున్ యాదవ్ పట్టుకొని రిమాండ్ తరలించినట్లు తూప్రాన్ సిఐ రంగకృష్ణ తెలిపారు.

వివక్ష లేని పరిపాలన కొనసాగిస్తామన్న మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పురపాలక సంఘ పరిధిలో 11వ వార్డు కౌన్సిలర్ మున్సిపల్ కార్యాలయం నందు ఇచ్చిన రిప్రజెంటేషన్‌కు మున్సిపల్ చైర్పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ వివక్ష లేని పాలన అందించడానికి, అత్యంత పారదర్శకంగా సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. తూప్రాన్ పట్టణ ప్రజల అవసరాల నిమిత్తం ఏ వార్డుపై ఎటువంటి వివక్ష లేకుండా అత్యంత పారదర్శకంగా సేవలను అందిస్తామన్నారు. ప్రజలకు అవసరమైనచోట కచ్చితంగా స్పీడ్ బ్రేకర్లు వేయడం జరుగుతుంది. స్ట్రీట్ లైట్స్ అవసరమైన చోట ఎటువంటి వివక్ష లేకుండా వేయడం జరుగుతుంది. తూప్రాన్ పురపాలక సంఘ కార్యాలయం బ్లూ క్రాస్ అనే స్వచ్ఛంద సంస్థతో ఎమ్ఓయు చేసుకోవడం జరిగిందన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల వారిగా కుక్కలను పట్టుకొని తీసుకు వెళ్ళి ఏ బిసి పద్ధతిలో వాటిని స్టెరిలైజ్ చేయడం జరుగుతుందన్నారు. తూప్రాన్ నుంచి



పడాల్ పల్లికి వెళ్లే దారిలో టవేరా వెంచర్ యందు గతంలో అక్కడ ఉన్నటువంటి ఐమాక్స్ లైట్స్ పోల్స్‌లను కొందరు వ్యక్తులు కలసి అపహరణకు గురిచేయగా వాటికి ఎటువంటి రక్షణ లేనందున అక్కడ ఎటువంటి జనవాసాలు లేనందున అక్కడ లైట్లు నిలిపివేశామన్నారు. గత పరిపాలనలో అధికార దురహంకారంతో జరిగిన పాలనకు పూర్తిగా చరమగీతం పాడుతూ ప్రజలకు అత్యంత పారదర్శకంగా సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ముదిరాజు తెలియజేశారు.

పడాల పల్లిలో బురదమయంగా మారిన రోడ్డు



నవతెలంగాణ-తూప్రాన్

మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు పడాల పల్లిలో వచ్చే దారిలో డివైడర్ ఇరువైపులా బురదమయంగా, గుంతలతో కూడిన రోడ్డు మరీ అధ్వానంగా తయారైందని కౌన్సిలర్ బొంది అరుణ వెంకట్ గౌడ్ వాపోయారు. ఈ రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేయడానికి చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మోయినుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే ఊరిలో కొత్తగా వేసిన సీసీ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని 8 నెలల కింద కౌన్సిల్ తీర్మానం చేసిన తరుణంలో వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గత కొన్ని రోజుల కిందట వీధి దీపాల కోసం వేసిన కరెంటు పోల్స్‌కు లైట్స్ ఫిట్టింగ్ చేయాలని, ఊరికి వెళ్ళే దారిలో టవేరా వెంచర్‌లో వేసిన బటర్ ఫ్లై లైట్లు బిగించి సిద్ధంగా ఉన్న లైట్లను వెలిగించాలన్నారు. యువతకు, వృద్ధులకు శారీరక దృఢత్వం కోసం ప్రొసిడింగ్ వచ్చిన ఓపెన్ జిమ్ ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రారంభించాలన్నారు. గ్రామంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని మున్సిపల్ కౌన్సిలర్ బొంది అరుణ వెంకట్ గౌడ్ వెంటనే చర్యలు చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ ప్రెసిడెంట్ లంబ రాజు యాదవ్, కనుకుంట సుదర్శన్, లంబ రాజు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని వాడి, బూరుగుపల్లి, గాజిరెడ్డి పల్లి గ్రామాలలో కార్యకర్తలతో పాటు బాధిత కుటుం బాలను పరామర్శించినారు. గాజిరెడ్డిపల్లి రేణుక ఎల్లమ్మ నూతన ఆలయ నిర్మాణానికి, విగ్రహ మూర్తుల ప్రతిష్ఠాపన కోసం లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడి గ్రామం దూప్ సింగ్ తాండ వెళ్లే మార్గంలో ఉన్న బ్రిడ్జి వద్దకు వెళ్లి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. వాడి గ్రామానికి చెందిన బలిజ నవీన్ కుమారుడు గతంలో ప్రమాదానికి గురికావడంతో కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామానికి చెందిన ప్రతాపరెడ్డి ఆరోగ్య రీత్యా సమస్య రావడంతో ఆయన కూతురికి కాలేజీ ఫీజులు చెల్లిస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా ప్రజల కోసం పనిచేయాలని ఏ ఆపద వచ్చిన మైనంపల్లి కుటుంబం ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందన్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి మండలాల వారిగా ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు చర్చించుకొని ఒక అభ్యర్థి పేరును ప్రకటించాలని కార్యకర్తలకు సూచించారు. జిల్లా స్థాయి మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు సుప్రభాత రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరశురాం గౌడ్, శేరి మహేందర్ రెడ్డి, బొజ్జ పవన్, చిట్యాల శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అక్బర్, రవీందర్ రెడ్డి, మంజులు, సిద్ధగిరి గౌడ్, బాల పోచయ్య, సాప చిన్న సాయిలు, సుభాష్ రెడ్డి, కిషన్ రెడ్డి, దుంబాల శంకర్, సాయిబాబా, గోపాల్, ఏసు, బాల్ రాజు, భాస్కర్, రాములు, గోపాల్ రెడ్డి, యాద గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-చేగుంట

మండలం పెద్ద శివనూర్ గ్రామంలో ఇటీవల కొయ్యల సత్తెమ్మ మరణించింది. విషయం తెలుసుకున్న చందాయిపేట మాజీ సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజ్ బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవుసుల రమేష్, జోగుమల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా

నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

ఉపాధి హామీ పథకంలో ఉన్న పనులను రైతులు ఉపాధి హామీ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పెద్ద శంకరంపేట ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట మండల



పరిధిలోని మల్కాపూర్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన హార్టికల్చర్ ప్లాంటేషన్, తదితర పనులను ఆమె పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో ఉన్న పనుల గురించి రైతులకు ప్రజలకు సిబ్బంది వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ నవాజుద్దీన్ టిఎలు రమేష్, స్వప్న, సుభాష్ మోహన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్త విధానాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్ : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డ్‌లోని తడి పొడి చెత్తను, అలాగే సేగ్రిగ్రేషన్ విధానాలను అమలు చేయాలని ఆర్కియాలజీ డైరెక్టర్, భారతి హొలీ కేరి అన్నారు. రాజీవ్ పార్క్‌లోని స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో మొక్కలను ఆమె నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యాంటీ లార్వా స్ప్రే ప్రాంతాలను పరిశీలించి, దోమల నివారణకు సూచనలు సలహాలు ఇచ్చారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా మన ఇంటి లోపల మన చుట్టూ పక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల వాళ్ళ వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నాటిన చెట్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రాజీవ్ పార్క్‌లోనే సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులతో మాట్లాడారు. ఆమె వెంట డీఆర్‌డీఓ మహాదేవ్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ నేతి చిన్నరాజమౌళి, మున్సిపల్ కమీషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మెన్ జక్కి ఉద్దీన్, కౌన్సిలర్స్ ఆతెల్లి శ్రీనివాస్, తలకొక్కుల భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, ప్రాథమిక ఆసుపత్రి వైద్య అధికారులు బాల్వీర్ సింగ్, మున్సిపల్ ఏఈ శ్రీధర్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్, నాయకులు, మెప్మా సరిత, మహిళా గ్రూప్ సభ్యులు, వార్డ్ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన కౌన్సిలర్

నవతెలంగాణ-సిద్దిపేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం మూడవ రోజులో భాగంగా మున్సిపల్ 5వ వార్డులో గుంతలలో ఉన్న నీటిని మొరంతో నేర్పి పూడ్చమని 5వ వార్డ్ కౌన్సిలర్ అన్నగోని వినోద్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ చుట్టూ పక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లడం జరిగిందని, గవర్నమెంటు పాఠశాలలో మొరాం నేర్పి, బ్లీచింగ్ చల్లినామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్, ఆర్పీ, అంగన్వాడీ టీచర్స్ జ్యోతి, చంద్రకళ, ఏఎన్ఎం శమీన్ సుల్తానా, ఆశా వర్కర్ లక్ష్మి, స్కూల్ ఉపాధ్యాయులు, జవాన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసర ప్రాంతంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

-మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రజలు తమ ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నివారణ చేయవచ్చని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం 17వ, 28వ, 36వ వార్డులలో మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ ప్రేరణ పాండా, స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి చైర్ పర్సన్ పర్యటించారు.వార్డులలో పర్యటిస్తూ నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి కాంక్రీట్‌తో గుంతలను పూడ్చివేశారు. 28వ వార్డు ముర్షద్ గడ్డలో మురికి కాలువలలోని పెరుకుపోయిన చెత్త తొలగింపు పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ప్రతిరోజు గుడ్డు, పాలు అందిస్తున్నార అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మల్లికార్జున్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రాజనర్సుని, కమిషనర్ ప్రేరణ పాండాని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, కౌన్సిలర్లు కాల్లకుంట మల్లికార్జున్, వడ్లకొండ సాయి కుమార్, ఏ.ఈ అన్వేష్ రెడ్డి, యాదగిరి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ చేర్యాల పట్టణ కమిటీ నియామకం

నవతెలంగాణ-చేర్యాల

కాంగ్రెస్ పార్టీ చేర్యాల పట్టణ పూర్తి స్థాయి కమిటీని పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు బుధవారం ప్రకటించారు.పట్టణ ఉపాధ్యక్షులుగా అంబాల నాగేశ్వర్, తుమ్మలపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా దాసరి శ్రీకాంత్, కోశాధికారిగా పిన్న రాజమౌళి, కార్యదర్శులుగా చింతల మల్లేశం, బుడిగె వెంకటేష్, కాత శ్రీనివాస్ తోపాటు 26 మందిని కార్యవర్గ సభ్యులుగా ప్రకటించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మర్కుక్



మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన నీల కృష్ణకు రూ.25,500 సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్ అందజేశారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

నవతెలంగాణ -నంగునూరు



మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని జెడ్పీ సీఈవో సి.రమేశ్ పిలుపునిచ్చారు. బుధవారం నంగునూరు మండలం ముండ్రాయి ప్రాథమికోన్నత పాఠశాలలో కొనసాగుతున్న స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని, రాబోయే కాలంలో ప్లాస్టిక్‌తో నష్టం జరిగే అవకాశం ఉందని తెలియజేశారు. పర్యావరణాన్ని సంరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.లక్ష్మప్ప, తహసీల్దార్ జి.సరిత, సూపరింటెండెంట్ ప్రభాకర్ రావు, ఎంపీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, రెవెన్యూ, విద్య, వైద్య, ఈజీఎస్, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చెట్టు ప్రగతికి మెట్టు



నవతెలంగాణ-అక్కన్నపేట

ప్రతి చెట్టు ప్రగతికి మెట్టని అక్కన్నపేట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలోని రామవరం గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్‌లో తప్పనిసరిగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దీనివల్ల దోమల బెడద తగ్గి ఆరోగ్యంగా జీవిస్తారని తెలియజేశారు. పరిసరాల్లో ఉండే నీటి తొట్లలో నీటిని తొలగించాలని అన్నారు. పరిసరాలు బాగుంటే మనం అంతా బాగుంటామని అన్నారు. అలాగే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బుర్ర ప్రభాకర్ గౌడ్, బండి కుమార్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు రిక్కల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగాల కనకయ్య ఏఈఓ సింధుజ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలి

-బీజేపీ ఎస్సీ మోర్చా మర్కుక్ మండలాధ్యక్షులు వెంకటేశ్



నవతెలంగాణ-మర్కుక్

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా మర్కుక్ మండలాధ్యక్షులు న్యాలపల్లి వెంకటేష్ అన్నారు. బుధవారం బీజేపీ మండలాధ్యక్షులు సాయి రెడ్డి రాంరెడ్డితో కలిసి ఆయన మర్కుక్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్ అమలు చేసి నిధులు ఇస్తామని తెలియజేశారని గుర్తుచేశారు. డిక్లరేషన్‌లో ప్రధానంగా అంబేద్కర్ అభయాస్తం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి రుణాలు షెడ్యూల్ కులాల వెనుకబడిన సాంఘిక సంక్షేమ వసతి గృహాల బడ్జెట్లో ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద ప్రతి కుటుంబానికి రూ.12 లక్షల ఆర్థిక సహాయంగా, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.750 కోట్లు కేటాయించాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు స్వయం ఉపాధి కోసం ఏడాదికి వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు పంజామధు యాదవ్, సంజీవరెడ్డి, తదితరులున్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎస్.శ్రీదేవి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



అధిక వర్షాల ప్రభావంతో వివిధ పంటలలో రైతులు సంరక్షణ చర్యలు చేపట్టాలని తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎస్ శ్రీదేవి అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల కేంద్రంలో వరి, మొక్కజొన్న, పత్తి, కూరగాయల సాగు పంటలను శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ వరిలో ముందుగా మురుగు నీటిని తొలగించి ప్రతి రెండు మీటర్లకు కాలిబాటన తీయడం వల్ల గాలి వెలుతురు బాగా వచ్చి సుడిదోమ నివారించవచ్చని అన్నారు. ముందస్తు నివారణకు ఎకరానికి పది కిలోల కార్బోఫ్యూరిన్, 3జీ గుళికలు వేయడం వల్ల కాండం తొలిచిపురుగు ఉల్లికోడును నివరించవచ్చని అన్నారు. ప్రత్తిలో వర్షాలు తగ్గిన తరువాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను మొక్కల మొదళ్ళలో వేయాలన్నారు. ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 19:19:19 మందు లేక 13-0-45మందు లేక 10 గ్రా. యూరియా లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న అధిక వర్షాల వలన నేలలో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలన్ని ఊదారంగులోకి మారే అవకాశం ఉంటుంది. 19-19-19 మందు లేక 20 గ్రా. డీఏపీ మందును లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేయాలి తెలిపారు. టమాట, వంగ, మిరప పంటల కుళ్ళు తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సి క్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి నేల పూర్తిగా తడిచేటట్లు పిచికారి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఉమారాణి, పల్లవి, రమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

- రాష్ట్ర కళాకారుల సంఘం నాయకులు వల్లపు స్వామి
- కోదండరామ్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమ కళాకారులు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎంతో మంది కళాకారులు ఇల్లు పిల్లలను వదిలి రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో గోసి గొంగడి వేసి పల్లెపల్లెల్లో ప్రజలను చైతన్యం చేసి పోలీసుల లాఠిదెబ్బలు, కేసులకు సైతం భయపడకుండా ఉద్యమాన్ని ఉధృతం చేసిన కళాకారులకు బీఆర్ఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని నిజాంపేట మండలంలోని కల్వకుంట గ్రామానికి చెందిన రాష్ట్ర కళాకారుల సంఘం నాయకులు వల్లపు స్వామి అన్నారు. హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ కోదండరాంను కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం సారథి పెట్టి ఎలాంటి నోటిఫికేషన్, ప్రకటన లేకుండా 550 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. కానీ అప్పటి చైర్మెన్ రసమయి బాలకిషన్ ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేనివారికి, ఆయన వద్దకు వెళ్లిన వారికి డైరెక్ట్‌గా కాల్ లెటర్స్ ఇచ్చి ఉద్యోగాలు ఇచ్చుకున్నారన్నారు. కానీ నిజంగా ఉద్యమం చేసిన ఉద్యమ కళాకారులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇదేంటని అడిగితే రెండవ లిస్ట్‌లో ఇస్తామని చెప్పారన్నారు. ఎన్నిసార్లు అప్పటి మంత్రులను కలిసి తమ బాధలు మొరపెట్టుకున్నా కనికరం చూపలేదన్నారు. ఇప్పటికైనా సాంస్కృతిక సారధీలో అర్హతలేని వారిని తొలగించి నిజమైన ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం పెద్దలతో మాట్లాడి తమ పేద ఉద్యమ కళాకారులకు అండగా ఉండాలని వినతి పత్రాన్ని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో బండకాడి గణేష్, చిన్నగుండేల్లి పరమేష్, ప్రజ్ఞాపూర్ నరేష్, రాజక్కపేట రమేష్‌లు ఉన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత మనదే

-కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్



నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డ, పోతారం ఎస్ గ్రామాలలో స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మొక్కలు నాటడం కాదు సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వీరన్న, పంచాయతీ కార్యదర్శులు రాకేష్, ఎల్లయ్య, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాళేశ్వరం నీరు ద్వారా చెరువులు, కుంటలు నింపాలి

నవతెలంగాణ-గజ్వేల్



కాళేశ్వరం నీరు ద్వారా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని చెరువులు, కుంటలు నింపాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్ అన్నారు. బుధవారం ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నియామకాల పేరట ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో గజ్వేల్ నియోజకవర్గం ప్రజలకు సాగునీరు, తాగునీరు అందని ద్రాక్షగా మారిందని పేర్కొన్నారు. కొండపోచమ్మ జలాశయం నిర్వాసితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ఆలేటి సుమతి, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మంద వెంకట్, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి, నరసింహ ముదిరాజ్, వడ్డేపల్లి ప్రసాద్, బీజేపీ నాయకులు నాగు ముదిరాజ్, బీజేపీ పట్టణ కోశాధికారి హరికుమార్, బీసీ, మహిళా, కిసాన్ మోర్చాల అధ్యక్షులు దువ్వల రాజు యాదవ్, కుంకుమ రాణి, సంఘేం కరుణాకర్, వేణుగోపాల రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పచ్చదనానికి ప్రాముఖ్యత నివ్వాలి

జిల్లా పరిషత్ సీఈవో రమేష్

నవతెలంగాణ - కొమురవెల్లి



గ్రామాలలో పరిశుభ్రత పచ్చదనానికి ప్రాముఖ్యత ఇవ్వాలని జిల్లా పరిషత్ సీఈవో రమేష్ అధికారులకు సూచించారు. బుధవారం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి ఎస్.కె అహ్మద్, ఎంపీడీవో కుమారస్వామిలతో కలిసి కిష్టంపేట రసులాబాద్ గ్రామాలలో పారిశుద్ధ్య పనులతో పాటు వన మహోత్సవాలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్ వర్మ, ఏపీవో బాల్ లింగం, జూనియర్ అసిస్టెంట్ రాములు, పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

బదిలీ అయిన ఆలయ ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ - కొమురవెల్లి

బదిలీ అయిన కొమురవెల్లి మల్లన్న ఆలయ ఉద్యోగులను తోటి ఉద్యోగులు, ఆలయ అర్చకులు బుధవారం ఆలయ ప్రాంగణంలో సన్మానించారు. ఉద్యోగులను ఏఈ ఓ బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, శాలువాతో సత్కరించారు. దేవాలయం నుండి బదిలీపై వెళ్లిన వారిలో ఎలక్ట్రికల్ ఏఈ బ్రాహ్మణులపల్లి అంజయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇటిక్యాల సందీప్, జూనియర్ అసిస్టెంట్ పోరండ్ల మాధవి, లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది అర్చకులు తదితరులు ఉన్నారు.

పోలీస్ కమిషనర్ ను కలిసిన చేర్యాల ఎస్ఐ నీరేష్

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల ఎస్ఐ గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన పి.నీరేష్ బుధవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ డాక్టర్ బి.అనురాధ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

పెద్దతండాలో జ్వర సర్వే

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం పెద్దతండా గ్రామాన్ని వైద్యాధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. అనంతరం ఇంటా బ్లడ్ శాంపిల్స్ తీసుకున్నారు. అలాగే పరిసరాల్లో పైరేత్రిన్ స్ప్రే చేసి ప్రజలందరికీ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలను నివారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ వినీత , ఎస్ యుఓ సాంబయ్య హెచ్ ఇ ఓ నారాయణదాసు, హెల్త్ అసిస్టెంట్ కొమురయ్య, అనిల్, ఆశాలు లక్ష్మి, పంచాయతీ సెక్రటరీలు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- దుబ్బాక ఎస్సై గంగరాజు

నవతెలంగాణ - దుబ్బాక రూరల్



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గంగరాజు సూచించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్కపేట గ్రామంలో సైబర్ నేరాలపై బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రోజు రోజు సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ప్రజలను మోసం చేయడం జరుగుతుందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటిపి అడిగిన చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్లు రైతులను రుణమాఫీ ఆప్ పేరుతో లింకులను పంపుతూ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. తెలియని లింకులను ఓపెన్ చేసి మోసపోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

డీఈవో శ్రీనివాసరెడ్డి



నవ తెలంగాణ - కొండపాక

చదువుతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యం పెంపొందించుకోవాలని సిద్దిపేట విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. కొండపాక మండలం సిరసనగండ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు అనంత రామారావు అందించిన ఆర్థిక సహాయంతో క్రీడా సామాగ్రి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో నైపుణ్యం సాధించి మంచి క్రీడాకారులుగా తయారు కావాలన్నారు. ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. చక్కగా చదువుకొని విజ్ఞానం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.. ఫోన్ లకు, టీవీలకు దూరంగా ఉండి చదువు పైనే శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎం ఈ ఓ శ్రీనివాసరెడ్డి , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్ది విఠల్ , ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులకు క్రీడా దుస్తులు సామాగ్రి కి ఆర్థిక సహాయం అందజేసిన అనంతరామారావు కు కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.ఆసీఫ్ సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు.సైబర్ జాగృతి దివస్ ను పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ పోలీసింగ్, సైబర్ అవేర్ నెస్ లపై వివరించారు.పోలీస్ సిబ్బంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-చేర్యాల



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తాజా మాజీ ఎంపీటీసీ గదరాజు యాదగిరి అన్నారు. ఈ కార్యక్రమంలో బుధవారం చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ యాదగిరి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి భాధ్యత అని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని, తడి,పొడి చెత్తను వేరుచేసి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో వేయాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనం కోసం విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బల్ల శ్రీనివాస్, సుజాత, రాజ్ కుమార్, గుల్లపల్లి కాంతి కృష్ణ, భిక్ష పతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు టన్నుల పీడీఎస్ రైస్ పట్టివేత

నవతెలంగాణ -నంగునూరు



ఉన్నతాధికారులు ఆదేశం మేరకు నంగునూరు మండలం పాలమకుల గ్రామంలో హుస్నాబాద్ - సిద్ధిపేట రోడ్డుపైన ఈ నెల 6 న రాత్రి వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఐదు టన్నుల పీడీఎస్ రైస్ ను పట్టుకున్నట్లు రాజగోపాల్ పేట ఎస్సై ఎం.డి.ఆసీఫ్ తెలిపారు.ఆయన కథనం ప్రకారం వివరాలిలా ఇలా ఉన్నాయి..హుస్నాబాద్ నుండి వస్తున్న ఒక టాటా పిక్ అప్ వెహికిల్‌ను ఆపి చెక్ చేయగా అందులో దాదాపు 5 టన్నులు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అక్కడే పంచనామా నిర్వహించి పోలీస్ స్టేషన్ తరలించామని చెప్పారు.సుమోటో కేసు నమోదు చేసి వెహికల్ డ్రైవర్ వంగ నగేశ్, పీడీఎస్ ఓనర్ కె.నరేశ్ రెడ్డి లపై కేసు నమోదు చేశామని తెలిపారు...

మొక్కలు నాటిన మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-తొగుట



స్వచ్ఛతనం పచ్చదనం వల్ల సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చని మాజీ ఎంపీటీసీ కంకణాల నర్సింలు అన్నారు. బుధవారం వెంకట రావుపేట ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు విధిగా ఐదు మొక్కలు నాటాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా కృషి చేస్తే సీజనల్ వ్యాధుల నుండి ఇబ్బందులు ఉండమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాషిని ఐసిడిఎస్ సూపర్వైజర్, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి అప్పగింత

-ఎస్సై అపూర్వ రెడ్డి



నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ తిరిగి బాధితుడికి అందించడం జరిగిందని సిద్దిపేట రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని చిన్న గుండవెల్లి గ్రామానికి చెందిన అందే రామ్ రెడ్డి తన ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన %షిషి.ఎవఱీ.స్త్రశీజ.ఱఅ% అనే వెబ్సైట్లో ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్ ను ఎంటర్ చేసి, బ్లాక్ చేయడం జరిగింది. ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం రాగానే ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని బాధితుడికి ఫోన్ అందజేయడం జరిగింది తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎవరైతే ఫోన్ పోగొట్టుకుంటే మరియు గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనంగా ఎత్తుకొని పోయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ పూర్తి వివరాలు నమోదు చేసి పోగొట్టుకున్న ఫోన్ ను నేరుగా బ్లాక్ చేయవచ్చని, తద్వారా కోల్పోయిన ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పోర్టల్ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరన్నా సెకండ్ హ్యాండ్ ఫోన్ లు అమ్మితే కొనవద్దని అన్నారు.

సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి మోసపోకుండా ఉండాలి

- ఎస్ఐ రవికాంత్ రావు.

నవతెలంగాణ-తొగుట



సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని ఎస్ఐ రవికాంత్ రావు అన్నారు. బుధవారం పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ ఆదేశాల మేరకు (సైబర్ జాగృకత దివాస్) కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు సైబర్ నేరగాళ్ళు పాల్పడే ఆర్థిక, ఆర్థికేతరా నేరాలపై తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల కళాశాలలో విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా సెల్ఫోన్లకు ఎంత దూరం ఉంటే అంత మంచిదని అన్నారు. టెక్నాల జీని మంచి గురించి ఉపయోగించుకొని ముందుకు సాగాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చెయ్యాలని తెలిపారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు ఓటీపీ, క్రెడిట్ కార్డ్ రిలేటెడ్ ఫ్రాడ్స్, బయోమెట్రిక్ వల్ల మోసాల గురించి తెలిపారు. ఇన్వెస్ట్మెంట్, ఆన్లైన్ పే మెంట్స్, అడ్వర్టైజ్మెంట్, ఫెడెక్స్ కొరియర్ ఫ్రేడ్స్, లోన్ యాప్ ల, ఓటీపీ, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్ ల గురించి వివరించారు. ప్రస్తుత సమాజంలో సెల్ ఫోన్ వలన ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో, అన్ని అనర్థాలు జరుగుతున్నాయని, సెల్ ఫోన్ విని యోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాల న్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడం తో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని సూచిం చారు. తమ ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, బంధువులకు, చుట్టూ ప్రక్కల వారికి, మీ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని విద్యార్థు లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపా ధ్యాయ బృందం, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.